ఈనాడు
పల్నాడు
మంగళవారం అక్టోబరు 8, 2024

నరసరావుపేట ఐసీఐసీఐ బ్యాంకులోనూ నగదు గోల్‌మాల్

ఈనాడు డిజిటల్, నరసరావుపేట: పల్నాడు జిల్లా చిలకలూరిపేట ఐసీఐసీఐ బ్యాంకులో ఫిక్స్‌డ్ డిపాజిట్ల బాండ్ల నుంచి నగదు తీసుకుని బ్యాంకు మేనేజర్ రూ.కోట్లలో మోసం చేసిన సంగతి విదితమే. అక్కడ బ్రాంచ్ మేనేజర్‌గా పనిచేసిన నరేష్ నరసరావుపేటలో విధులు నిర్వహించిన సమయంలో ఖాతాదారుల నుంచి ఫిక్స్‌డ్ డిపాజిట్లు సేకరించి వారిని కూడా మోసం చేసినట్లు అధికారులు గుర్తించారు. ముంబయి నుంచి వచ్చిన జోనల్ మేనేజర్ సందీప్ మెహ్రా సోమవారం సాయంత్రం 4 గంటల ప్రాంతంలో నరసరావుపేటలోని ఐసీఐసీఐ బ్యాంకులో పలువురు ఖాతాదారులను పిలిపించి మాట్లాడారు. ఇక్కడ కూడా నరేష్ కొందరిని మోసం చేసినట్లు గుర్తించారు. ఖాతాదారులతో మాట్లాడి ఫిక్స్‌డ్ డిపాజిట్లు చేయించి, ఓడీ ఖాతా తెరిపించి, నిధులు సొంతానికి వాడుకుని నెలనెలా వ్యక్తిగతంగా వడ్డీ చెల్లించాడు. ఖాతాదారుల సెల్‌ఫోన్ నుంచే ఓటీపీ చెప్పించుకుని ఈ మోసానికి పాల్పడినట్లు అధికారులు గుర్తించారు. సోమవారం వరకూ ఎనిమిది మంది ఖాతాదారులతో ఉన్నతాధికారులు మాట్లాడారు. సుమారు రూ.కోటి వరకూ ఇలా నగదు గల్లంతైనట్లు తెలుస్తోంది.


అమరేశ్వరాలయంలో బాలచాముండికా అమ్మవారి అలంకరణ


గణపవరం గండి పోచమ్మ ఆలయంలో మహాచండీగా..

శక్తి స్వరూపిణి.. జగజ్జనని

దసరా పురస్కరించుకుని దేవీశరన్నవరాత్రులు వైభవంగా కొనసాగుతున్నాయి. ఆలయాల్లో కుంకుమ పూజలు, అమ్మవారికి అలంకరణలు చేస్తున్నారు. జగన్మాత వివిధరూపాల్లో భక్తులకు దర్శనమిస్తుండడంతో ఆధ్యాత్మిక కోలాహలం నెలకొంటుంది. పలుచోట్ల బతుకమ్మ ఆటపాటలతో మహిళలు సందడి చేస్తున్నారు.

- న్యూస్‌టుడే, అమరావతి, చిలకలూరిపేట పట్టణం, మాచర్ల


మాచర్లలో బతుకమ్మలతో మహిళలు

మాకు కొంత.. మీఇష్టం అంతా

ఈనాడు, అమరావతి



ప్రకాశం, పల్నాడు జిల్లాల సరిహద్దు ప్రాంతం.. సుమారు 200 గ్రామాలకు పురుగుమందులు, ఎరువులు సరఫరా చేసే వినుకొండలో పురుగుమందుల వ్యాపారులు కొందరు అనుమతి లేని బయో ఉత్పత్తులు రైతులకు అంటగడుతున్నారు. మిర్చి, పత్తి పంటలకు ఎక్కువగా వాడే పురుగుమందుల పేర్లతో కొన్ని అక్షరాలు మార్చి అదే పేరుతో అమ్మకాలు సాగిస్తూ జేబులు నింపుకొంటున్నారు. పల్నాడు, ప్రకాశం జిల్లాలకే పరిమితం కాకుండా గుంటూరు జిల్లాకు కూడా రవాణా చేసి విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. అనుమతి లేని బయో ఉత్పత్తులు విక్రయిస్తుంటే కట్టడి చేసి రైతులకు నాణ్యమైన ఉత్పత్తులు అందేలా చూడాల్సిన వ్యవసాయశాఖలో కొందరు మీరేమైనా అమ్ముకోండి... మాకు మాత్రం మామూళ్లు ముట్టజెప్పండి అన్నట్లు తయారైంది. అనుమతి లేని బయో మందులు కూడా వ్యాపారి బిల్లులో నమోదు చేసి విక్రయించడమే ఇందుకు నిదర్శనం. పత్రికల్లో వార్తలు వచ్చినప్పుడు హడావుడి చేయడం మినహా నిర్మాణాత్మక చర్యలు లేవు. వినుకొండలో ఎరువుల అధికధరకు అమ్ముతున్నారా అనే విషయంపై రైతు ఫిర్యాదు చేస్తే అప్పుడు వ్యవసాయశాఖ యంత్రాంగం కదిలింది. గుంటూరు నుంచి నిఘా విభాగం బృందం వెళ్లి గడువు మీరిన మందులు అమ్ముతున్నారని గుర్తిస్తే కేసు నమోదు చేశారు. బయోలు ఎక్కడ తయారు చేస్తున్నారు? ఏయే ఉత్పత్తులు తయారవుతున్నాయి? ఎక్కడ మార్కెట్ చేస్తున్నారన్న వివరాలన్నీ వ్యవసాయశాఖ వద్ద ఉన్నా వాటిని కట్టడి చేయడంలో విఫలమవుతున్నారు.

అనతికాలంలో అధికాదాయం

వినుకొండ కేంద్రంగా తయారవుతున్న బయో ఉత్పత్తుల ప్రముఖ కంపెనీ పురుగు మందులను పోలిన పేర్లతో విక్రయాలు చేస్తుండటంతో డిమాండ్ పెరిగింది. పల్నాడు, ప్రకాశంతోపాటు గుంటూరు జిల్లాకు విస్తరించాయి. గుంటూరు నగరానికి తెలంగాణ ప్రాంతం నుంచి కూడా రైతులు వచ్చి పురుగుమందులు కొనుగోలు చేస్తుంటారు. ఈ క్రమంలో వినుకొండలో ప్రముఖ పురుగుమందులను పోలిన బయో ఉత్పత్తులు లభిస్తున్నాయని తెలిసి వాటిని కొనుగోలు చేస్తున్నారు. కొన్నింటికి అనుమతులు తీసుకుని వాటి మాటున అనుమతిలేని ఉత్పత్తులు తయారు చేసి విక్రయిస్తున్నారు. పెట్టుబడి, తయారీ ఖర్చు తక్కువగా ఉండటంతో స్వల్పకాలంలోనే అధికాదాయాన్ని పొందుతున్నారు. బయో ఉత్పత్తులతో లాభాలు ఎక్కువగా ఉండటంతో వ్యాపారులు వాటిని అమ్మటానికే మొగ్గుచూపుతున్నారు. ఈవ్యవహారం వ్యవసాయశాఖలో కొందరికి తెలిసినా మామూళ్ల మాటున మిన్నకుండిపోతున్నారు. క్షేత్రస్థాయి అధికారి ఒకరు, జిల్లా కేంద్రంలో పనిచేసే అధికారి ఒకరు వ్యాపారులకు అన్నివిధాలా సహకారం అందిస్తున్నారు.

పర్యావరణానికి విఘాతం

అనుమతి లేని బయో ఉత్పత్తులు వల్ల పర్యావరణానికి తీవ్ర విఘాతం కలుగుతోంది. బయోల్లో మొక్కలు, సముద్రగర్భం నుంచి తీసిన జీవసంబంధ పదార్థాలు మాత్రమే వాడాలి. అనుమతి లేని బయో ఉత్పత్తుల్లో ఎక్కువగా పురుగుమందులు కలిపి విక్రయిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. పురుగుమందులు నిపుణుల పర్యవేక్షణలో తయారు చేసి ప్రభుత్వం ఆధ్వర్యంలో ప్రయోగశాలలో పరీక్షించి నిర్దిష్ట మోతాదులో రసాయనాలు ఉన్నవాటికే అనుమతి ఇస్తారు. బహుళజాతి సంస్థలు కావడంతో ప్రతిదశలోనూ నాణ్యతను తనిఖీ చేసుకుని మార్కెట్‌లోకి విడుదల చేస్తాయి. బయో ఉత్పత్తులు తయారుచేసేవారికి పర్యవేక్షణ లేకపోవడం, పరిమితికి మించి రసాయనాలు కలిపి విక్రయించడంతో పర్యావరణానికి తీవ్ర విఘాతం కలుగుతోందని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా వ్యవసాయశాఖ నిర్దిష్టమైన చర్యలు తీసుకుని రైతులకు నాణ్యమైన మందులు అందేలా చూడాల్సి ఉంది.


బిడ్డను చూసుకొని సంతోషపడుతున్న తల్లి నసీమా

పసికందు అపహరణ

- గుంటూరు ప్రభుత్వాసుపత్రిలో ఘటన
- గంటల వ్యవధిలో పట్టుకున్న పోలీసులు

గుంటూరు వైద్యం, అచ్చంపేట, న్యూస్‌టుడే : గుంటూరు సర్వజనాసుపత్రి (జీజీహెచ్)లో సోమవారం పసికందు అపహరణకు గురికావడం కలకలం రేపింది. పోలీసులు గంటల వ్యవధిలో కేసును ఛేదించారు. అపహరించిన ముఠాను అరెస్టు చేయడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు. పోలీసులు, బాధితుల వివరాల ప్రకారం... గుంటూరు శివారు గోరంట్లకు చెందిన షేక్ నసీమా ఆదివారం రాత్రి జీజీహెచ్ కాన్పుల వార్డులో చేరారు. అర్ధరాత్రి మగబిడ్డకు జన్మనిచ్చారు. మధ్యాహ్నం ఒంటి గంట ప్రాంతంలో ఓ మహిళ బాలింతలా కాన్పుల వార్డులోకి వచ్చింది. నసీమా వద్దకు వెళ్లి తనకు కొద్ది రోజుల కిందట బిడ్డపుట్టి చనిపోయినట్లు చెప్పి ఏడ్చింది. 'నీ బిడ్డ బాగున్నాడు' పక్కనే ఉన్న తన భర్తకు చూపించి వస్తానంటూ నసీమా వద్ద ఉన్న పసికందును తీసుకొని వెళ్లింది. శస్త్రచికిత్స చేసిన మత్తులో ఉన్న నసీమా సరేనని ఊరుకుంది. అర్ధగంట దాటినా తన బిడ్డను తీసుకురాకపోవడంతో నసీమా పోలీసులకు ఫిర్యాదు చేసింది. వెంటనే కొత్తపేట సీఐ వీరయ్య కేసు నమోదు చేసి ఎస్పీ సతీష్‌కుమార్ దృష్టికి తీసుకువెళ్లారు. జీజీహెచ్‌కు చేరుకొని సూపరింటెండెంట్ కిరణ్‌కుమార్‌తో కలిసి నిఘా నేత్రాలు పరిశీలించారు. అనుమానిత మహిళను గుర్తించారు.

ఆటోలో వచ్చి.. : ఎస్పీ ఆదేశాలతో తూర్పు డీఎస్పీ అబ్దుల్ అజీజ్, ఎస్బీ డీఎస్పీ సీతారామయ్య, కొత్తపేట సీఐ వీరయ్య తదితరులు బృందాలుగా ఏర్పడి నిందితురాలి కోసం గాలించారు. ఆ మహిళతో పాటు మరో ముగ్గురు జీజీహెచ్ నుంచి ఆటోలో పసికందును తీసుకెళ్తున్నట్లు సీసీ కెమెరాల్లో గుర్తించారు. నగరంలోని నిఘానేత్రాలను పరిశీలిస్తూ ఎస్పీ కార్యాలయం నుంచి సాంకేతిక పరిజ్ఞానంతో మరికొంత సమాచారం సేకరించారు. నిందితులు పల్నాడు జిల్లాకు వెళ్లినట్లు తేలడంతో కొత్తపేట సీఐ వీరయ్య తమ బృందాలతో అక్కడికి చేరుకున్నారు. నిందితులు అచ్చంపేట మండలం కోనూరులో ఉన్నట్లు సాయంత్రం 6 గంటలకు గుర్తించారు.

ముగ్గురు నిందితుల అరెస్టు : బోరుగడ్డ శిరీష పసికందును అపహరించి తీసుకువెళ్లినట్లు తేలింది. కోనూరులో బోరుగడ్డ శిరీషతోపాటు ఆమె భర్త ప్రేమ్‌కుమార్, చింతపల్లి మంగమ్మ (శిరీష తల్లి)ను అరెస్టు చేసి గుంటూరు తీసుకువచ్చామని ఎస్పీ సతీష్‌కుమార్ తెలిపారు. పసికందును జీజీహెచ్‌లో ఉన్న తల్లి నసీమా చెంతకు చేర్చారు. బిడ్డను చూసిన తల్లి ఆనందం వ్యక్తం చేసింది. అనంతరం ఎస్పీ విలేకరులతో మాట్లాడుతూ... ఆటోలో నలుగురు వచ్చి బాబును అపహరించినట్లు గుర్తించామని, ఇప్పటికి ముగ్గురిని అరెస్టు చేశామని మరో వ్యక్తికోసం గాలిస్తున్నామన్నారు. శిరీష మాత్రం తాను జీజీహెచ్‌లో బాబుకు జన్మనిచ్చానని, ఆ పసికందునే తీసుకువెళ్లానని చెబుతున్నారని, అది వాస్తవమా కాదా అనేది దర్యాప్తు చేయాల్సి ఉందన్నారు.


వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ సతీష్‌కుమార్, వైద్యులు

24న జీజీహెచ్‌లో చేరిన శిరీష : జీజీహెచ్ సూపరింటెండెంట్ కిరణ్‌కుమార్ మాట్లాడుతూ... గత నెల 20న బోరుగడ్డ శిరీష, పిడుగురాళ్ల అని ప్రభుత్వాసుపత్రికి వచ్చినట్టు తమ రికార్డుల్లో ఉందన్నారు. ఆమె తన బిడ్డకు గుండెజబ్బు ఉందని 24న ఆసుపత్రిలో చేరగా.. . 25న ఆ బిడ్డ చనిపోవడంతో ఆసుపత్రి నుంచి వెళ్లిపోయారని చెప్పారు. కేసు విచారణ తరువాత పూర్తి వివరాలు తెలుస్తాయని పోలీసులు చెప్పారు.



గుంటూరు జోన్‌లో ఒక్క రోజులో 1,020


గుంటూరు నేరవార్తలు: గుంటూరు జోన్ పరిధిలోని మద్యం దుకాణాలకు సోమవారం దరఖాస్తులు వెల్లువలా వచ్చాయి. ఆదివారం వరకు జోన్ పరిధిలోని గుంటూరు, పల్నాడు జిల్లాల్లోని 256 మద్యం దుకాణాలకు 618 దరఖాస్తులు మాత్రమే వచ్చాయి. సోమవారం ఒక్కరోజు గుంటూరు జిల్లాలో 800, పల్నాడు జిల్లాలో 220 దరఖాస్తులు వచ్చాయి. గత ఆరు రోజులుగా మందకొండిగా దాఖలుకాగా సోమవారం మంచి రోజు కావడంతో వ్యాపారులు ఒక్కసారిగా తరలిరావడంతో ఎక్సైజ్ పోలీసుస్టేషన్లు కిక్కిరిసిపోయాయి. సోమవారం సాయంత్రానికి గుంటూరు జిల్లాలో 127 దుకాణాలకు మొత్తం 1200, పల్నాడు జిల్లాలోని 129 దుకాణాలకు గాను 644 దరఖాస్తులురాగా మూడు దుకాణాలకు ఒక్కటి నమోదు కాలేదు. ఎక్సైజ్ పోలీసుస్టేషన్‌ల్లో సీఐలు, ఎస్సైలు, సిబ్బంది సోమవారం రాత్రి వరకు దరఖాస్తులు స్వీకరిస్తున్నారు.

పత్తి కొన్నారు.. డబ్బులివ్వడం లేదు

గుంటూరు: గుంటూరుకు చెందిన నేరెళ్ల హరిప్రసాద్ పత్తి కొనుగోలు చేసి.. డబ్బులు ఇవ్వడంలేదని ఉమ్మడి గుంటూరు జిల్లాకు చెందిన బాధితులు మంత్రి అచ్చెన్నాయుడుకు విన్నవించారు. గుంటూరు కలెక్టరేట్‌కు సోమవారం వచ్చిన మంత్రిని బాధితులు కలిశారు. నిందితుడి రూ.1.90 కోట్లు చెల్లించాల్సి ఉందని, తమకు పత్తి అమ్మిన వారంతా వచ్చి డబ్బులు అడుగుతున్నారని, ఆ డబ్బులు రాకుంటే తామంతా ఆత్మహత్య చేసుకోవాల్సిన పరిస్థితి ఉందంటూ ఓ బాధితురాలు వాపోయారు. దీనిపై మంత్రి అచ్చెన్నాయుడు కలెక్టర్ ఎస్.నాగలక్ష్మికి సమస్య పరిష్కరించాలని సూచించారు. బాధితులతో కలెక్టర్ మాట్లాడి వివరాలడిగి తెలుసుకున్నారు.

ఉపాధికి ఊతంగా పొగనారుమళ్లు
రైతేరాజు
కందిలో వెర్రి తెగులు.. నివారణ చర్యలు 8లో

ప్రమాదకరంగా అక్విడెక్ట్ వంతెన


కింద చంద్రవంక వాగు పైన సాగర్ జలాలు ప్రవహించే అక్విడెక్ట్

ఉమ్మడి గుంటూరు జిల్లాలో లక్షల ఎకరాలకు సాగునీరందించే సాగర్ కుడికాలువ ప్రారంభంలో చంద్రవంక అక్విడెక్ట్ వద్ద ప్రమాదకరంగా మారింది. మాచర్ల సమీపంలో కింద చంద్రవంక వాగు ఉండగా పైన 9 వేల క్యూసెక్యులకు పైగా సాగర్ కుడికాలువ జలాలు వెళ్లేలా దీన్ని నిర్మించారు. ప్రవాహ వేగం ఉండే ఈ వంతెన వద్ద గోడలకు రెండువైపులా చెట్లు పెరిగి ప్రమాదకరంగా మారుతోంది. అడుగుభాగంగా నుంచి లీకేజీ నీరు బయటకు వస్తోంది. సాగునీరు ప్రవహించే కాలువలో ఈ అక్విడెక్ట్ వద్ద వంతెనను ఇలాగే వదిలేస్తే దెబ్బతినే అవకాశం ఉంది. ఈ వాగు కానాల్లో ఒకదాని గుండా మాచర్ల నుంచి రెంటచింతల మండలంలోని పలుగ్రామాలకు వెళ్లే రహదారి ఉంది. ఈ మార్గం కూడా లీకేజీ నీటితో పాచిపట్టి జారుతోంది. ఈ క్రమంలో వాహనదారులు జారిపడుతున్నారు. జలవనరుల శాఖ అధికారులు స్పందించి వంతెనకు ఇరువైపులా ప్రమాదకరంగా పెరుగుతున్న చెట్లను తొలగించాలని రైతులు కోరుతున్నారు.

-ఈనాడు, నరసరావుపేట


సాగర్ జలాలు ప్రవహించే కాలువ వంతెన గోడల్లో పెరుగుతున్న చెట్లు


లీకేజీ నీటితో పాచిపట్టిన రహదారి ఇలా..


ఆ మార్గంలో జారిపడిన ద్విచక్ర వాహనదారుడు

వయో వృద్ధుల సంక్షేమంపై అవగాహన కల్పించాలి


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు తదితరులు

నరసరావుపేట అర్బన్ : జిల్లాలో తల్లిదండ్రుల, వయో వృద్ధుల సంక్షేమం, పోషణకు సంబంధించిన అంశాలపై అవగాహన కల్పించాలని కలెక్టర్ అరుణ్‌బాబు అన్నారు. కలెక్టరేట్‌లో సోమవారం విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కరపత్రాలను కలెక్టర్ ఆవిష్కరించారు. జిల్లా ప్రజలకు 2007లో రూపొందించిన చట్టం గురించి నేషనల్ ప్లాన్ ఫర్ సీనియర్ సిటిజన్స్‌లో భాగంగా ప్రచారం చేయాల్సి ఉందని కలెక్టర్ తెలిపారు. జేసీ సూరజ్ గనోరే, జిల్లా అధికారిణి సువార్త తదితరులు ఉన్నారు.

సీట్ల కేటాయింపుపై కసరత్తు

గుంటూరు, న్యూస్‌టుడే : ప్రభుత్వ ఉద్యోగుల బదిలీల ప్రక్రియ పూర్తయి పక్షం రోజులవుతున్నా జిల్లా పరిషత్తు కార్యాలయంలో బదిలీపై వచ్చిన ఉద్యోగులకు సీట్లు కేటాయించడంపై కసరత్తు పూర్తి కాలేదు. జడ్పీలో పని చేస్తున్న మొత్తం పది మంది పరిపాలన అధికారుల్లో ముగ్గురిని మినహాయించి మిగిలినవారిని బదిలీ చేశారు. వారి స్థానాల్లో బదిలీపై వచ్చిన ఏవోలు విధుల్లో చేరిపోయారు. వీరితో పాటు జూనియర్, సీనియర్ అసిస్టెంట్లు, టైపిస్టులు, రికార్డు అసిస్టెంట్లు, ఆఫీస్ సబార్డినేట్లు బదిలీపై వచ్చి విధుల్లో చేరారు. వీరందరికీ విభాగాలను కేటాయించి ఆఫీస్ ఆర్డర్ ఇస్తే ఆయా సీట్ల బాధ్యతలను నిర్వహిస్తారు. పరిపాలన అధికారులను ఏయే విభాగాల్లో నియమించాలనే దానిపైనే కసరత్తు చేస్తున్నారు. జిల్లాపరిషత్తు పాలకవర్గంతో చర్చించిన తర్వాత సీఈవో జ్యోతిబసు ఓఓ ఇవ్వాల్సి ఉంది. ఇప్పటికే పక్షం రోజులవడంతో సీట్లను కేటాయించకపోవడంతో సీఈవో సూచనల మేరకు సిబ్బంది ఆయా పనులు చేస్తున్నారు. ఒకటీ, రెండు రోజుల్లో ఉద్యోగులకు సీట్లు కేటాయించనున్నట్లు సమాచారం.

అంతరిక్ష పరిశోధనలపై విద్యార్థులు దృష్టి సారించాలి


ప్యానెళ్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే అరవిందబాబు, ఎస్పీ శ్రీనివాసరావు

నరసరావుపేట అర్బన్: విద్యార్థులు అంతరిక్ష పరిశోధనలపై దృష్టి సారించాలని వక్తలు పేర్కొన్నారు. ఇస్రో ఆధ్వర్యంలో నరసరావుపేట ఇంజినీరింగ్ కళాశాలలో మూడు రోజుల పాటు నిర్వహిస్తున్న అంతరిక్ష వారోత్సవాలు సోమవారం ప్రారంభించారు. ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఇస్రో జీఎం రవికుమార్, ఎమ్మెల్యే చదలవాడ అరవిందబాబు, జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ ఇస్రో 1957లో తొలిసారిగా స్పుత్నిక్ అనే ఉప గ్రహాన్ని అంతరిక్షంలోకి పంపిందని, అప్పటి నుంచి అంతరిక్ష పరిశోధనలు చేస్తూ అనేక మైలురాళ్లను దాటిందని తెలిపారు. స్వదేశీ పరిజ్ఞానాన్ని పెంచుకుని మరిన్ని పరిశోధనలు చేసి.. ప్రపంచంలోనే భారత్‌ను అగ్రగామిగా నిలపాలని తెలిపారు. ఎస్పీ శ్రీనివాసరావు మాట్లాడుతూ శాస్త్రవేత్తల కృషి కారణంగా ఇస్రో మహోన్నతమైన స్థానానికి చేరిందని, చంద్రయాన్- 3 ప్రయోగం ప్రతిష్టాత్మకంగా చేపట్టినట్లు పేర్కొన్నారు. సీనియర్ శాస్త్రవేత్త గ్రహదురై మాట్లాడుతూ ఇప్పటికి 125 ఉప గ్రహాలను అంతరిక్షంలోకి పంపామని, అంతే కాకుండా తేలికపాటి ఉప గ్రహాలను స్వదేశీ పరిజ్ఞానంతో అంతరిక్షంలోకి పంపే సామర్థ్యం తమకు ఉందన్నారు. ఎమ్మెల్యే అరవిందబాబు మాట్లాడుతూ దేశం ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి విద్యార్థులు కృషి చేయాలని సూచించారు. ఈ సందర్భంగా ఇస్రో ఏర్పాటు చేసిన ప్యానెల్స్‌ను అతిథులు ఆవిష్కరించారు. ప్రదర్శనను విద్యార్థులు తిలకించారు. కళాశాల ఛైర్మన్ మిట్టపల్లి కోటేశ్వరరావు, వైస్ ఛైర్మన్ చక్రవర్తి, కార్యదర్శి రమేష్, ప్రిన్సిపల్ డాక్టర్ వెంకటేశ్వర్లు, విభాగాధిపతులు పాల్గొన్నారు.

అంతా ఒక్కటై..

- ప్రభుత్వ ఆదాయానికి గండికొట్టేలా మద్యం దరఖాస్తుదారుల కుమ్మక్కు
- మాచర్ల, గురజాల, పెదకూరపాడుల్లో తక్కువగా రాక

మొత్తం దుకాణాలు: 129
సోమవారం వరకు వచ్చిన దరఖాస్తులు: 470
ఇప్పటివరకూ ఒక్కటీ దరఖాస్తు రాని దుకాణాలు: 10
తక్కువ దరఖాస్తులు: మాచర్ల, గురజాల, పెదకూరపాడు

ఈనాడు డిజిటల్, నరసరావుపేట

ప్రభుత్వానికి ఆదాయం వచ్చే లక్ష్యంతో ప్రైవేటు దుకాణాలకు లైసెన్స్ ఇచ్చేలా మద్యం పాలసీని ప్రవేశపెడితే.. స్థానిక ప్రజాప్రతినిధుల ఆగడాలు అధికమయ్యాయి. సిండికేటుగా మారి ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతున్నారు. జిల్లాలో 129 మద్యం దుకాణాలకు ఎక్సైజ్ శాఖ దరఖాస్తులు స్వీకరిస్తోంది. అందుకు ఈనెల 9వ తేదీ ఆఖరు. ఇప్పటివరకూ మాచర్ల, గురజాల, పెదకూరపాడు నియోజకవర్గాల్లో తక్కువ దరఖాస్తులు వచ్చాయని ఎక్సైజ్ అధికారులు వెల్లడించారు. ఎమ్మెల్యేలు ఎవరూ మద్యం దుకాణాల దరఖాస్తుల విషయంలో తలదూర్చవద్దని సీఎం చంద్రబాబునాయుడు చెప్పడంతో సోమవారం దరఖాస్తులు పెరిగినట్లు తెలుస్తోంది.

వైకాపా హయాంలో మద్యం దుకాణాలు ప్రభుత్వమే నిర్వహించగా.. కూటమి ప్రభుత్వం వచ్చాక మళ్లీ పాత విధానాన్ని ప్రవేశపెట్టింది. ఐదేళ్లు మద్యం వ్యాపారులు ఖాళీగా ఉండాల్సి వచ్చింది. ప్రస్తుతం తెచ్చిన పాత విధానంతో మద్యం వ్యాపారుల్లో ఆసక్తి నెలకొంది. ఈసారి కొత్తవారు కూడా మద్యం వ్యాపారంలోకి ప్రవేశించేందుకు ఉత్సాహం చూపుతున్నారు. అందులో సాఫ్ట్‌వేర్లు, వైద్యులు ఉండడం గమనార్హం. దరఖాస్తు ఫీజు రూ.2 లక్షలుగా ప్రభుత్వం నిర్దేశించింది. ఈ ఫీజు తిరిగి రాదు. దీంతో మద్యం వ్యాపారంపై ఆసక్తి చూపేవారు సిండికేట్ అవుతున్నట్లు సమాచారం. ఈ మేరకు వ్యాపారుల మధ్య సంప్రదింపులు ఊపందుకున్నాయి. ఈ చర్చల్లో అధికార పార్టీ నేతలు కీలకపాత్ర పోషిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. మద్యం దుకాణాల విషయంలో కొన్నిచోట్ల అధికార పార్టీ నేతలు బేరసారాలకు తెరలేపినట్లు సమాచారం. కొన్ని ప్రాంతాల్లో ఒక్కో మద్యం దుకాణానికి రూ.25 లక్షలు చెల్లించాలన్న ప్రాతిపాదన తెరపైకి వచ్చింది. కొందరు నేతల కనుసన్నల్లోనే మద్యం దుకాణాలకు సంబంధించి దరఖాస్తుల ప్రక్రియ సాగుతోంది. ఏ స్టేషన్ పరిధిలో ఎవరు దరఖాస్తు చేస్తున్నారు అనే సమాచారాన్ని అధికారుల నుంచి రాజకీయ నేతలు సేకరిస్తున్నారు.

☛ పల్నాడుకు ముఖద్వారంగా ఉండే నియోజకవర్గంలోని ప్రజాప్రతినిధికి సంవత్సరానికి రూ.25 లక్షలు చెల్లించాలని ముందస్తుగానే ఒప్పందం. ఆ మొత్తం ఎవరు ఇస్తే వారికే మద్యం దుకాణం అని వినికిడి. దీనిపై రాజకీయ వర్గాల్లో చర్చ నడుస్తోంది.



ఎక్సైజ్ విభాగం కార్యాలయం

☛ పల్నాడు ప్రాంతంగా పిలిచే ఓ నియోజకవర్గంలో ఒక్కో దుకాణానికి కేవలం అయిదుగురే దరఖాస్తు చేయాలని, అదీ తాము చెప్పిన మనుషులే అందులో ఉండాలని ఆ ప్రజాప్రతినిధి అనుచరగణం హుకుం జారీచేసింది. దీంతో ఇక్కడ నుంచి తక్కువ దరఖాస్తులు వచ్చాయి.

☛ కృష్ణాతీరాన ఉండే ఓ నియోజకవర్గంలో ఎమ్మెల్యేకు ప్రమేయం లేకుండా వైకాపా నుంచి తెదేపాలోకి వచ్చిన కొందరు స్థానిక నాయకులతో మాట్లాడి ఎక్కువ దరఖాస్తులు చేయకుండా అడ్డుకుంటున్నారు. దీంతో ఆసక్తి ఉన్న వాళ్లు ఆ తర్వాత లాటరీలో దుకాణం వచ్చినా వ్యాపారం చేయనివ్వరని ఆలోచనతో ఇతర ప్రాంతాలకు వెళ్లి దరఖాస్తు చేసుకుంటున్నారు. సదరు నేతలే సిండికేట్‌గా ఏర్పడి దుకాణాలన్నీ చేతిలోకి తీసుకోవడానికి తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు.

అవగాహన పెంచు.. లక్ష్యం సాధించు

వయోజనుల టీకా కార్యక్రమంలో చివరి స్థానం

సత్తెనపల్లి గ్రామీణ, న్యూస్‌టుడే

దేశంలో క్షయ బాధితుల సంఖ్యను 2025 నాటికి గణనీయంగా తగ్గించాలనే ఉద్దేశంతో వయోజనులకు బీసీజీ టీకా కార్యక్రమాన్ని కేంద్రం అమలు చేస్తోంది. మధుమేహంతో బాధపడే వయోజనులు, బీఎంఐ స్థాయిలు స్వల్పంగా ఉన్న వ్యక్తులకు వ్యాధి నిరోధకశక్తి తక్కువగా ఉండటంతో సులువుగా క్షయ వ్యాధికి గురయ్యే అవకాశం ఉంది. వ్యాధిని సకాలంలో గుర్తించని పక్షంలో శరీరంలో వెన్నెముక, ఎముకలు, మెదడు తదితర ఇతర భాగాలకు వ్యాపించే ప్రమాదం ఉంది. నివారణకు రూ.లక్షల్లో ఖర్చు చేసినా ప్రయోజనం కనిపించకపోవచ్చు. చాపకింద నీరులా ముంచుకొస్తున్న ఈ ఉపద్రవం నివారణ చర్యల్లో భాగంగా రాష్ట్రంలో 12 జిల్లాల్లో పైలట్ ప్రాజెక్టుగా వయోజనుల బీసీజీ టీకా కార్యక్రమాన్ని చేపట్టారు. అందులో పల్నాడు జిల్లాను ఎంపిక చేయగా ఇంటింటి సర్వే చేపట్టి అర్హుల వివరాలను ఆరోగ్య సిబ్బంది సేకరించారు. ఆరు నెలల కిందట ప్రారంభించిన ఈ ప్రక్రియ జిల్లాలో ముందుకు సాగడం లేదు. 12 జిల్లాల్లో చివరి స్థానంలో నిలిచింది.



వృద్ధుడికి టీకా వేస్తున్న ఆరోగ్య సిబ్బంది

టీకా ఎవరికి ఇస్తారంటే..

అరవై ఏళ్ల వయసు పైబడిన వారికి, మధుమేహంతో బాధపడే వారికి, గత ఐదేళ్ల కిందట టీబీ సోకిన వారికి, వ్యాధిగ్రస్తులతో సన్నిహితంగా మెలిగే వారికి, గతంలో, ప్రస్తుతం పొగ తాగే వారికి టీకా వేస్తారు.

వెనుకబాటుకు కారణాలు..

గృహ సందర్శనలు నిర్వహించి టీకా ప్రయోజనాలపై ఎంఎల్‌హెచ్‌పీలు, ఆరోగ్య సిబ్బంది అవగాహన కల్పించారు. వైద్య, ఆరోగ్యశాఖ అధికారులు సమీక్షలు చేపట్టి సిబ్బందికి నెలవారీ లక్ష్యాలు నిర్దేశించారు. అయినా కొవిడ్-19 టీకాపై రేకెత్తిన అనుమానాల తరహాలో సందేహాలు వ్యక్తం అవుతున్నాయి. టీకా పొంగి కనీసం రెండు వారాలు దురదగా ఉంటోందని, చేతులు నొప్పిగా ఉంటున్నాయని కొందరు ప్రచారం చేస్తున్నారు. ఇతర దుష్ప్రభావాలను ఎదుర్కోవాల్సి వస్తుందనే భయంతో పలువురు ముందుకు రావడంలేదు. వయోజనుల్లో ఆరోగ్య సిబ్బంది అవగాహన పెంచి లక్ష్య సాధనకు కృషి చేయాలి.

24.13 శాతమే పూర్తి

12 జిల్లాల్లో 50,42,086 మంది లక్ష్యం కాగా 22,62,455 మందికి టీకా ఇచ్చారు. 44.87 శాతం నమోదైంది. పల్నాడు జిల్లాలో 5,38,130కు గాను 1,29,857 మందికి టీకా వేశారు. 24.13 శాతంతో ఆఖరి స్థానంలో నిలిచింది. 23 పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 37 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో ఆరు నెలల కిందట ప్రక్రియ చేపట్టారు. నరసరావుపేటలోని బరంపేట పట్టణ పీహెచ్‌సీ పరిధిలో 1,255 మందిని గుర్తించి 1,143 మందికి టీకా వేశారు. 91.07 శాతంతో జిల్లాలో ప్రథమ స్థానంలో ఉన్నారు. మాచవరం పీహెచ్‌సీ పరిధిలో 16,745 మందికి గాను 1,883 మందికి టీకా వేసి.. 11.24 శాతంతో చివరి స్థానంలో ఉన్నారు.

ఆందోళన వీడాలి

టీకా పట్ల వయోజనుల్లో వివిధ రకాల ఆందోళనలు ఉన్నాయి. వాటిని వీడాలని నిరంతరం అవగాహన కల్పిస్తున్నాం. టీకా చేసిన భాగంలో కొద్దిగా నొప్పి రావడం సహజమని వివరిస్తున్నాం. లక్ష్య సాధనకు సిబ్బందిని ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తున్నాం. - రవి, జిల్లా వైద్యాధికారి

మరుగుదొడ్డే వంటశాలా?

అధికారుల తనిఖీల్లో వెలుగులోకి

దాచేపల్లి, న్యూస్‌టుడే: మరుగుదొడ్డి గదిలో పిండి కలుపుతున్నారు.. అక్కడే ఆహార పదార్థాలను నిల్వ చేస్తున్నట్లు ఫుడ్ సేఫ్టీ అధికారులు గుర్తించారు. ఈ విషయం దాచేపల్లిలో సోమవారం వెలుగుచూసింది. నేషనల్ హ్యూమన్ రైట్స్ కమిషన్ పల్నాడు జిల్లా ఛైర్మన్ తాళ్లూరి శౌరిబాబు ఫిర్యాదు మేరకు సోమవారం ఫుడ్ సేఫ్టీ అధికారులు దాచేపల్లిలోని పలు బేకరీ దుకాణాల్లో తనిఖీలు చేశారు. కారంపూడి రోడ్డులోని అయ్యంగార్ మంజునాథ బేకరీలో ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్ తనిఖీ చేయగా మరుగుదొడ్డిని వంటశాలగా వాడుతున్నట్లు గుర్తించారు. గడువు ముగిసిన ఆహార పదార్థాలు ఉన్నాయి. దీంతో దుకాణాన్ని సీజ్ చేశారు. ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి కేసు నమోదు చేస్తామని అధికారులు తెలిపారు. తనిఖీల్లో ఎన్‌హెచ్‌ఆర్సీ గౌరవ అధ్యక్షుడు నషీమ్ బాషా పాల్గొన్నారు.

మద్యం దుకాణాలకు 64 దరఖాస్తులు

వినుకొండ: ఎక్సైజ్, ప్రొహిబీషన్ వినుకొండ సర్కిల్ పరిధిలో 14 మద్యం దుకాణాలకు సోమవారం సాయంత్రానికి 64 దరఖాస్తులు అందాయని సీఐ దేవర శ్రీనివాసరావు తెలిపారు.

నిర్దేశిత సమయంలో ఫిర్యాదులు పరిష్కరించండి

ఎస్పీ కంచి శ్రీనివాసరావు

నరసరావుపేట టౌన్, న్యూస్‌టుడే : జిల్లా పోలీసు ప్రజావేదికలో అందించిన ఫిర్యాదులను నిర్దేశిత సమయంలోగా పరిష్కరించాలని పోలీసు అధికారులను ఎస్పీ కంచి శ్రీనివాసరావు ఆదేశించారు. నరసరావుపేట జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావేదిక కార్యక్రమంలో ఎస్పీ పాల్గొని ఫిర్యాదులు స్వీకరించారు. మొత్తం 73 ఫిర్యాదులు అందినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ జేవీ సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

కొన్న స్థలం రిజిస్ట్రేషన్ చేయడం లేదు

మా గ్రామంలో 2020లో కాకాని వద్ద జేఎన్‌టీయూ సమీపంలో సువర్ణభూమి వెంచర్‌లో 200 గజాల స్థలం మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ కొడావత్ లక్ష్మణ్‌నాయక్ ఇప్పించాడు. డబ్బులు మొత్తం చెల్లించినా రిజిస్ట్రేషన్ చేయించకుండా ఇబ్బందులు పెడుతున్నాడు. ఫోన్ చేసినా ఎత్తడం లేదు.

-విష్ణుమూర్తి, అల్లూరివారిపాలెం

యూరప్ పంపుతానని మోసం

నా కుమారుడి చదువుల నిమిత్తం యూరప్ దేశానికి పంపాలని రూ.10 లక్షలు లలిత ఇనిస్టూట్ ఆఫ్ టూరిజం అండ్ హోటల్ మేనేజ్‌మెంట్ అబ్రాడ్ బిజినెస్ కన్సల్టెన్సీ తరఫున మేనేజర్ అయిన కత్తి సునీతకు ఇచ్చా. రెండు సంవత్సరాలైనా ఇంత వరకు యూరప్ పంపకపోగా తీసుకున్న డబ్బులు ఇవ్వలేదు. అడిగితే సమాధానం చెప్పడం లేదు. వారిపై చర్యలు తీసుకోవాలి.

-పరుచూరి ఆంజనేయులు, రామిరెడ్డిపాలెం, రొంపిచర్ల మండలం

రైల్వే శాఖలో ఉద్యోగం పేరిట..

సత్తెనపల్లికి చెందిన ఉర్లకొండ సాంబశివరావు 2019లో దండమూడి పూర్ణచంద్రరావుతో పరిచయం ఏర్పడింది. సుమారు మూడేళ్ల క్రితం ఫిర్యాదికి రైల్వేలో ఉద్యోగం ఇప్పిస్తానని పలు దఫాలుగా నా నుంచి రూ.60 లక్షలు తీసుకొని ఉద్యోగం ఇప్పించకుండా మోసం చేశాడు.

- సాంబశివరావు, సత్తెనపల్లి

ప్రతి అర్జీకి పరిష్కారం చూపాలి: కలెక్టర్

ప్రజా సమస్యల పరిష్కారవేదికకు 104 అర్జీలు

నరసరావుపేట అర్బన్: ప్రజలు ఇచ్చిన ప్రతి అర్జీకి పరిష్కారం చూపాలని కలెక్టర్ అరుణ్‌బాబు అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. కలెక్టర్‌తో పాటు జేసీ సూరజ్ గనోరే ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజలు 104 అర్జీలు అధికారులకు అందజేసి పరిష్కరించాలని కోరారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలు తమ సమస్యలు పరిష్కారం అవుతాయన్న నమ్మకంతో దూరప్రాంతాల నుంచి వస్తున్నారని, వారి సమస్యలను విని పరిష్కారం చూపాలని ఆదేశించారు. ప్రజలు అర్జీలు రాయించుకునేందుకు అధికారులు సిబ్బందిని నియమించారు.

దాడులకు పాల్పడిన వారిని శిక్షించాలి

పట్టణంలో ముస్లిం కుటుంబంపై దాడులకు పాల్పడిన బార్ యజమానులపై చర్యలు తీసుకోవాలని పీడీఎం ఆధ్వర్యంలో బాధితులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. వినుకొండలో రోడ్డులో గాంధీ జయంతి నాడు మద్యం విక్రయాలకు పాల్పడిన యాజమాన్యం ఒక వివాదాన్ని సాకుగా చూపి దాడికి పాల్పడటమే కాకుండా చంపుతామని బెదిరిస్తున్నట్లు బాధితులు కలెక్టర్‌కు తెలిపారు. నిందితులను అరెస్ట్ చేయాలని, బాధితులకు రక్షణ కల్పించాలని కోరారు. నల్లపాటి రామారావు, మస్తాన్‌వలి, రామకృష్ణ, బాదుగున్నల శ్రీను, తదితరులు ఉన్నారు.

గుంటూరులో పీఎంజే జ్యువెల్స్ స్టోర్ ప్రారంభం

ఏటీ అగ్రహారం, న్యూస్‌టుడే: పీఎంజే జ్యువెల్స్ గుంటూరులో ఏర్పాటు చేసిన కొత్త ఔట్‌లెట్‌ను గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గల్లా మాధవి సోమవారం ప్రారంభించారు. ఎమ్మెల్యే మాధవి మాట్లాడుతూ కొత్త షోరూం ఆభరణాల ప్రియులను ఎంతగానో ఆకర్షిస్తుందన్నారు. పీఎంజే జ్యువెల్స్ ఏపీ స్టేట్ హెడ్ హైదర్ అలి మాట్లాడుతూ గుంటూరుతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల్లోని ఆభరణాల ప్రియులు కొత్త స్టోర్‌లో అందుబాటులోకి తీసుకొచ్చిన సరికొత్త డిజైన్లను కచ్చితంగా ఇష్టపడతారన్నారు. వినియోగదారుల అభిరుచులను దృష్టిలో ఉంచుకుని వజ్రాలు, బంగారం, విలువైన రాళ్లతో విస్తృతమైన డిజైన్ల ప్రదర్శనను ఇక్కడ ఏర్పాటు చేశామన్నారు. వివాహ వేడుకలకు సంబంధించిన ఆభరణాలు, కార్యాలయం, పార్టీవేర్, సాధారణ రోజువారీ దుస్తులకు అనువైన తెలికపాటి క్రియేషన్లు, అద్భుత ఆభరణాల సేకరణ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయన్నారు. కార్యక్రమంలో క్లస్టర్ మేనేజర్ కందకూరి అరవింద్‌కుమార్, గుంటూరు స్టోర్ మేనేజర్ మహేష్‌కృష్ణ చైతన్య పాల్గొన్నారు.



జ్యోతి వెలిగించి అవుట్‌లెట్ ప్రారంభిస్తున్న గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గల్లా మాధవి, పీఎంజే జ్యువెల్స్ ఏపీ స్టేట్ హెడ్ హైదర్ అలి, అరవింద్‌కుమార్, మహేష్‌కృష్ణ చైతన్య

కాలుజారి బావిలో పడి వృద్ధుడి మృతి



రాములు (పాతచిత్రం)

వినుకొండ రూరల్, న్యూస్‌టుడే : పొలం పని ముగించుకుని వస్తూ చేతులు శుభ్రం చేసుకోవడానికి బావి వద్దకు వెళ్లిన వృద్ధుడు కాలుజారి అందులో పడి మృతి చెందాడు. సోమవారం ఉమ్మడివరంలో ఇది జరిగింది. మృతుని కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మేడిపల్లి రాములు (70) తోటి కూలీలతో కలిసి మాగాణిలో పారపనికి వెళ్లాడు. పని ముగిశాక చేతులు శుభ్రపరచుకోవడానికి చామా వెంకటేశ్వర్లు పొలంలోని బావి వద్దకు వెళ్లి అక్కడ ప్రమాదవశాత్తు కాలుజారి బావిలో పడగా నీటిలో ఊపిరాడక మృతి చెందాడు. రాములు ఎంత సేపటికీ రాకపోవడంతో అప్పటికే కొంతదూరం వెళ్లిన తోటి కూలీలు బావి వద్దకు వచ్చి చూడగా మృతి చెంది ఉన్నాడు. సమాచారం గ్రామస్థులకు తెలియజేయగా వారు వచ్చి మృతదేహాన్ని బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం వినుకొండ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతుడికి భార్య పుల్లమ్మ, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు.

ఆకట్టుకున్న రంగవల్లి

నరసరావుపేట ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహిస్తున్న అంతరిక్ష వారోత్సవాల ప్రారంభోత్సవం సందర్భంగా ఎన్‌సీసీ క్యాడెట్లు రంగవల్లులు దిద్దారు. అతిథులకు స్వాగతం పలుకుతూ వేసిన రంగవల్లి ఆకట్టుకుంది.

-నరసరావుపేట అర్బన్, న్యూస్‌టుడే





బ్రాయిలర్ ధరలు (కిలో ఒక్కింటికి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 123, రిటైల్ ధర - 145, చికెన్ విత్‌స్కిన్ - 210, చికెన్ స్కిన్‌లెస్ - 239.

కృష్ణా జిల్లాలో: వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -120 రిటైల్ ధర 142 చికెన్ విత్ స్కిన్ - 206, చికెన్ స్కిన్‌లెస్ - 234.

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 128, 138, 148 చికెన్ విత్ స్కిన్ - 240 చికెన్ స్కిన్‌లెస్ - 250.

నెక్ సూచించిన కోడిగ్రుడ్లు ధర

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్డు ధర 100 గుడ్లకు రూ. 525 (వాణిజ్యం & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.88/-.

వైకాపా నేతల ధనదాహానికి భర్త బలయ్యాడు

ఆదుకోవాలని ఓ మహిళ వేడుకోలు

అమరావతి, న్యూస్‌టుడే: 'వైకాపా నేతలు ధనదాహంతో తీసిన ఇసుక గుంతల్లో పడి రెండేళ్ల కిందట తన భర్త మల్లికార్జునరావు చనిపోయాడు. నేను, నా బిడ్డ రోడ్డున పడ్డాం.. ఆదుకోవాలంటూ' లేమల్లెకు చెందిన సిరిపురపు నవ్య ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ వద్ద కన్నీటి పర్యంతమైంది. సోమవారం అమరావతి ఎంపీడీఓ కార్యాలయంలో ఎమ్మెల్యే చేపట్టిన ప్రజాదర్బార్‌లో నవ్య తనకు జరిగిన అన్యాయంపై ఏకరవు పెట్టింది. తాము తెదేపా సానుభూతిపరులమన్న ఉద్దేశంతో పరిహారం రాకుండా అడ్డుకున్నారన్నారు. పుట్టింటిలో కాలం వెళ్లదీస్తున్నారని ఆవేదన వ్యక్తం చేసింది. దీంతో ఎమ్మెల్యే స్పందించి అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. దరఖాస్తు చేసుకుంటే ఒప్పంద ఉద్యోగం కల్పించేందుకు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే నిర్వహించిన ప్రజాదర్బారులో వినతులు వెల్లువలా వచ్చాయి. అధికశాతం రెవెన్యూ శాఖకు సంబంధించిన సమస్యలపై విన్నవించారు. ప్రతి అర్జీని పరిశీలించి, సమస్యను పరిష్కరించాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. అన్ని మండలాల్లో ప్రజాదర్బారు నిర్వహిస్తామని ఆయన తెలిపారు. సమస్యలు లేని నియోజకవర్గంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఎంపీడీఓ శివపార్వతి, తహసీల్దార్ నాగమల్లేశ్వరరావు, సీఐ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



ఆదుకోవాలని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్‌కు మొరపెట్టుకుంటున్న లేమల్లెకు చెందిన నవ్య

బౌన్సర్ హత్య కేసులో నిందితుడి అరెస్ట్

తెనాలి టౌన్: తెనాలిలో ఇటీవల హత్యకు గురైన బౌన్సర్ పి.కోటేశ్వరరావు (36) కేసులో నిందితుడు షేక్ ఆదాము షఫీను అరెస్ట్ చేసినట్లు డీఎస్పీ బి.జనార్దనరావు తెలిపారు. తెనాలి గ్రామీణ సర్కిల్ కార్యాలయంలో సోమవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కోటేశ్వరరావు, షఫీ ఇరువురు చాలా కాలంగా స్నేహితులు. గతంలో కోటేశ్వరరావు వద్ద షఫీ రూ.10 వేలు అప్పుగా తీసుకుని తిరిగి చెల్లించలేదు. దీనితో కోటేశ్వరరావు తరుచూ అర్ధరాత్రి సమయాల్లో షఫీకి ఫోన్ చేసి నువ్వు అప్పు తీర్చలేకపోతే నీ భార్యను పంపు అంటూ అసభ్యకరంగా మాట్లేడేవాడు. పదేపదే ఇది కొనసాగటంతో కోటేశ్వరరావుపై కక్ష పెంచుకున్న షఫీ ఈ నెల 1న మందు తాగుదాం రమ్మని పిలిచి బుర్రిపాలెం రోడ్డులోని ఖాళీ స్థలంలో మద్యం తాగిన తర్వాత తాను వెంట తెచ్చుకున్న కత్తితో విచక్షణారహితంగా అతనిపై దాడి చేయటంతో రక్తగాయాలతో ఘటనా స్థలిలోనే ప్రాణాలు విడిచాడు. వివరించారు. ఈ నెల 2వ తేది ఉదయం ఫిర్యాదు అందుకున్న పోలీసులు దర్యాప్తు చేసి యావత్తు అంశాలను తెలుసుకుని షఫీని అరెస్ట్ చేశారు. సమావేశంలో శిక్షణ డీఎస్పీ ఎన్.భార్గవి, సీఐ బి.శ్రీనివాసరావు, ఎస్సై ప్రతాప్, కానిస్టేబుళ్లు బాలాజీ, వి.రవి, డి.రవి పాల్గొన్నారు.

చెస్ విజేతలకు బహుమతులు



చెస్ విజేత గోవింద్‌కు బహుమతి అందిస్తున్న ప్రతినిధులు

మాచర్ల (కారంపూడి), న్యూస్‌టుడే: ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల స్థాయి చెస్ పోటీల విజేతలకు బహుమతుల ప్రదానోత్సవం సోమవారం పట్టణంలో కిడ్స్ పాఠశాల ఆవరణలో నిర్వహించారు. ప్రథమ బహుమతి రూ.10 వేలు గుంటూరుకు చెందిన గోవింద్ సొంతం చేసుకున్నారు. ద్వితీయ బహుమతి రూ.8 వేలు నరసరావుపేటకు చెందిన గోపీనాథ్, తృతీయ బహుమతి రూ.5 వేలు బాపట్లకు చెందిన బాలకృష్ణ అందుకున్నారు. మాచర్ల మున్సిపల్ ఛైర్మన్ పోలూరి నరసింహారావు, తెదేపా నాయకుడు యనుముల కేశవరెడ్డి, ఎంఈవో సురేష్ బహుమతులు అందజేశారు.

అద్దంకి బ్రాంచి కెనాల్‌లో యువకుడి గల్లంతు

గంటావారిపాలెం (శావల్యాపురం), న్యూస్‌టుడే : మామ అల్లుళ్లు సరదాగా ఈత కొట్టడానికి వెళ్లగా అల్లుడు కాల్వలో నీటి ప్రవాహానికి గల్లంతయ్యాడు. మండలంలోని అద్దంకి బ్రాంచి కెనాల్ వద్ద సోమవారం ఇది జరిగింది. స్థానిక ఎస్సై లేళ్ల లోకేశ్వరరావు వివరాల ప్రకారం.. వినుకొండ మండలం లయోలా పాఠశాల సమీపంలోని నాగిరెడ్డిపల్లెకు చెందిన కె.సతీష్‌బాబు (23), తన మేనమామ సుందరాజుతో కలిసి సరదాగా ఏబీసీ కాలువలో ఈత కొట్టడానికి వచ్చారు. ఆ సమయంలో సుందరాజుకు ఎవరో ఫోన్ చేయగా అవతలికి వెళ్లి మాట్లాడుతుండగా సతీష్ బాబు రైల్వే ట్రాక్ సమీపంలో మెట్ల వద్ద హడావుడిగా వెళ్లి కాల్వలోకి దిగి నీటి ప్రవాహంలో గల్లంతయ్యాడు. విషయం తెలిసిన వెంటనే ఎస్సై సిబ్బందితో కాలువ వద్దకు వెళ్లి వివరాలు సేకరించారు.

నరసరావుపేట
•నరసరావుపేట • వినుకొండ • చిలకలూరిపేట

సమస్యలు పరిష్కరించాలని వినతి

నాదెండ్ల, న్యూస్‌టుడే : గణపవరం శివప్రియనగర్‌లో సమస్యలు పరిష్కరించాలని ప్లాట్ల యజమానులు ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావును కలిసి వినతి పత్రం అందజేశారు. 1998లో శివప్రియనగర్‌లో స్థలాలు కొనగా.. ప్రస్తుతం పిచ్చిచెట్లు మొలిచి అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారిందన్నారు. ఇటీవల కంపచెట్లు తొలగించి.. రోడ్లు ఏర్పాటు చేసుకున్నామని, విద్యుత్తు సరఫరా, మంచినీటి సౌకర్యం కల్పిస్తే నివాసాలు ఏర్పాటు చేసుకుంటామని చెప్పారు. కొద్దిపాటి వర్షానికి మురుగునీరు శివప్రియ నగర్‌పై పడి ముంచెత్తుతోందని, సైడ్ డ్రైన్స్ ఏర్పాటు చేయాలని కోరారు. చాలా ఆలస్యం అయినందున త్వరగా చర్యలు చేపట్టాలన్నారు. పేలూరి రామారావు, వీరాంజనేయులు, సుబ్రహ్మణ్యం తదితరులున్నారు.

గుడి ప్రదక్షిణ.. కుంకుమార్చన


వినుకొండ పాత శివాలయంలో గుడి ప్రదక్షిణ చేస్తున్న మహిళలు

వినుకొండ, న్యూస్‌టుడే : దేవీ శరన్నవ రాత్రులు పురస్కరించుకొని వినుకొండ పాత శివాలయంలో సోమవారం 108 మంది మహిళలు గుడి ప్రదక్షిణ చేసి కుంకుమార్చన చేశారు. భక్తులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

నరసరావుపేట అర్బన్ : 80085 73156
యడ్లపాడు : 8008145652 వినుకొండ గ్రామీణ : 9440009293

? దొండపాడు వెళ్లే రోడ్డు పక్కన సచివాలయం సమీపంలో చేతి పంపు చుట్టూ అపరిశుభ్రంగా ఉంది. చుట్టూ సిమెంటుతో రింగ్ ఏర్పాటు చేయాలి. **-బంగారయ్య, తిమ్మాయిపాలెం**

✔ అధికారులు బదిలీ పనుల్లో ఉన్నారు. కొత్తవారు వచ్చిన వెంటనే ఏర్పాటు చేయిస్తాం.
-సుందరరెడ్డి, ఈవోపీఆర్డీ, వినుకొండ
-వినుకొండ రూరల్, న్యూస్‌టుడే

? మురికిపూడి నుంచి రామచంద్రాపురం మీదుగా వచ్చే రహదారి అధ్వానంగా ఉంది.-సాంబశివరావు, రామచంద్రాపురం

✔ పరిశీలించి మరమ్మతులు చేపట్టేలా చర్యలు తీసుకుంటాం.
-శ్రీనివాసరావు, పంచాయతీరాజ్ డీఈ, చిలకలూరిపేట

? వేలూరులో చాలాచోట్ల విద్యుద్దీపాలు వెలగడం లేదు. కొత్తవి ఏర్పాటు చేయగలరు. **-సీతారామయ్య**

✔ పాడైనవి తొలగించి కొత్తవి ఏర్పాటు చేస్తాం.-**క్రాంతి, పంచాయతీ కార్యదర్శి - న్యూస్‌టుడే, చిలకలూరిపేట గ్రామీణ**

టమాటా ధర మోత..

కిలో రూ.100కు పెరిగి జనం బెంబేలు
ఇతర నిత్యావసరాలు కొనడం భారమే

చిలకలూరిపేట గ్రామీణ, వినుకొండ, న్యూస్‌టుడే



కూరగాయలంటే ముందుగా గుర్తొచ్చేది టమాటా. జిల్లాలో ప్రస్తుతం రెండు రోజుల్లోనే ధర అమాంతంగా పెరిగి రెట్టింపు అయింది. మేలురకం కిలో రూ.60 ఉన్న టమాటా శని, ఆదివారాల్లో బహిరంగ మార్కెట్లో రూ.100 పలుకుతోంది. ఏ ఇంట్లోనైనా కూరలోకి ఇది లేకపోతే కుదరదు. దీంతో ఆదివారం రైతు బజారుకు వచ్చిన వినియోగదారులు కిలో ధర విని అవాక్కయ్యారు. అయితే రాయితీపై కిలో రూ.71కి ఇస్తున్నా అవి నాసిరకంగా ఉన్నాయి. దీంతో రూ.50 చెల్లించి నాణ్యమైన టమోటా అరకిలో కొని సర్దుకుంటున్నారు. ప్రధానంగా మహారాష్ట్ర, మదనపల్లి తదితర ప్రాంతాల నుంచి టమాటాలు దిగుమతి అవుతుంటాయి. ప్రస్తుతం ఉత్పత్తి తగ్గి తక్కువ మొత్తంలో దిగుమతి అవుతున్నట్లు వ్యాపారులు చెబుతున్నారు. పంట చేతికి వచ్చే వరకు మరో నెల ఇదే ధర కొనసాగుతుందని అంచనా వేస్తున్నారు.

❖ చిలకలూరిపేటలో రైతు బజారు ఉండగా.. ఇక్కడ కాస్త తక్కువ ధరకు కూరగాయలు దొరుకుతున్నాయి. అదే వినుకొండలో రైతుబజారు లేక వ్యాపారులు చెప్పిన ధరకు కొనాల్సి వస్తోంది. ఇలా వీటిని కొనలేక తక్కువ ధరకు వచ్చే పచ్చిమిర్చి, ఆకుకూరలు కొని తీసుకెళ్తున్నారు. వినుకొండలో కూడా రైతు బజారు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ఏమీ కొనలేకపోతున్నాం..



వారం వ్యవధిలో అన్ని రకాల కూరగాయల ధరలు పెరిగాయి. పామాయిల్ ధర మొన్నటి వరకు కిలో రూ.95 ఉండగా, ప్రస్తుతం రూ.120కి పెరిగింది. ఉల్లిపాయలు రూ.40 నుంచి రూ.60కి చేరుకున్నాయి. టమాటాలు రూ.30 ఉండగా ఒక్కసారిగా రూ.100కు ఎగబాకాయి. ఇలా అన్ని కూరగాయలు, నిత్యావసరాలు పెరిగి రూ.200కు రెండు, మూడు రకాలు కూడా రావడం లేదు. నిరుపేదలం బతకడం కష్టమే. ప్రభుత్వం ధరలు అదుపులో ఉంచాలి.

- ఎం.పోలమ్మ, ఈపూరివారిపాలెం

విధేయులకే పట్టం

❖ రొంపిచర్ల, నరసరావుపేట మార్కెట్ యార్డు ఛైర్మన్ల ఎంపిక
❖ పాలకవర్గ డైరెక్టర్ల నియామకానికి కసరత్తు

నరసరావుపేట వ్యవసాయం, న్యూస్‌టుడే

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కొద్ది రోజులకే నరసరావుపేట నియోజకవర్గంలోని కీలకమైన నరసరావుపేట, రొంపిచర్ల మార్కెట్ యార్డుల ఛైర్మన్ పదవులను, పాలక వర్గాల నియామకానికి చర్యలు తీసుకుంది. ఛైర్మన్ల, వైస్ ఛైర్మన్ల ఎంపిక తుది దశకు చేరగా డైరెక్టర్ల ఎంపికపై రెండు మండలాల నేతలు సమాలోచనలు చేస్తున్నారు. ఇప్పటికే రొంపిచర్ల మార్కెట్ యార్డు పాలక వర్గానికి సంబంధించి రెండు, మూడు డైరెక్టర్ల ఎంపిక మినహా మిగిలినవి పూర్తి చేసినట్లు తెదేపా మండల నాయకులు తెలిపారు. రాష్ట్రంలో ఇటీవల ఎన్నికల్లో తెదేపా, జనసేన, భాజపాల మధ్య సీట్ల పంపకానికి అనుసరించిన సూత్రాన్నే మార్కెట్ యార్డుల ఛైర్మన్లు, వైస్ ఛైర్మన్ల, డైరెక్టర్ల ఎంపికలో వర్తింపజేసింది. రొంపిచర్ల మార్కెట్ ఛైర్మన్ పదవిని తెదేపా వారికి ఇవ్వగా, వైస్ ఛైర్మన్ జనసేనకు, నరసరావుపేటలో ఛైర్మన్ పదవి తెదేపాకు, వైస్ ఛైర్మన్ భాజపాకు ఇచ్చేలా నిర్ణయించారు. యార్డు డైరెక్టర్ల పదవులు కూడా ఇదే సూత్రాన్ని అమలు చేస్తామని ఓ సీనియర్ తెదేపా నేత తెలిపారు.


రొంపిచర్ల మార్కెట్‌యార్డు

రొంపిచర్ల మార్కెట్‌యార్డు ఛైర్మన్‌గా శాఖమూరి: కష్టకాలంలోనూ తెదేపాను అంటిపెట్టుకుని విధేయత, అంకితభావం, చిత్తశుద్ధితో పని చేసిన వారికి ప్రాధాన్యమిచ్చి నామినేటెడ్ పోస్టులకు ఎంపిక చేశారు. రొంపిచర్ల మార్కెట్ యార్డు ఛైర్మన్‌గా ముత్తనపల్లికి చెందిన తెదేపా సీనియర్ నేత శాఖమూరి రామ్మూర్తిని అధిష్ఠానం ఎంపిక చేసింది. వైస్ ఛైర్మన్ పదవిని జనసేనకు కేటాయించింది. దీనికి సంతగుడిపాడుకు చెందిన పార్టీ మండల అధ్యక్షుడు అచ్చుల సాంబశివరావు పేరు వినిపిస్తోంది. తొలుత రొంపిచర్ల మార్కెట్ యార్డు ఛైర్మన్ పదవిని గోగులపాడు, రొంపిచర్లకు చెందిన వారు ఆశించి తమ కోరికను ఎమ్మెల్యే చదలవాడ అరవిందబాబుకు చెప్పారు. అన్నింటినీ బేరీజు వేసుకొని కష్టకాలంలో తెదేపాను అంటి పెట్టుకుని పనిచేసిన వారికి ప్రాధాన్యమిచ్చి నామినేటెడ్ పోస్టులకు అర్హులను ఎంపిక చేశారు.

నరసరావుపేటలో గోప్యం

నియోజకవర్గంలో నరసరావుపేట మార్కెట్ యార్డు ఛైర్మన్ పదవి చాలా కీలకమైనది. దీనికి తీవ్ర పోటీ నెలకొంది. రోజుకొక పేరు తెర మీదకి వచ్చింది. రెండు రోజుల నుంచి తెదేపా యువనేత చల్లా సుబ్బారావు పేరును యార్డు ఛైర్మన్‌గా రాష్ట్ర పార్టీ ఎంపిక చేసిందని ప్రచారం జరిగింది. అయితే అధిష్ఠానం ఆలోచన మాత్రం వేరేలా ఉంది. పమిడిపాడుకు చెందిన పార్టీ మాజీ మండల అధ్యక్షుడు పునాటి శ్రీనివాసరావు వైపు మొగ్గు చూపి ఎంపిక చేసినట్లు విశ్వసనీయ సమాచారం. ఇక్కడ వైస్ ఛైర్మన్ పదవిని భాజపాకు కేటాయించాలని నిర్ణయించారు. మొత్తం మీద రెండు మార్కెట్ యార్డుల పాలకవర్గాలను నియమించే అవకాశం ఉంది.

శ్మశానవాటికలో ముళ్లచెట్ల తొలగింపు

చిలకలూరిపేట పట్టణం, న్యూస్‌టుడే : స్థానిక శారదా పాఠశాల పక్కన ఉన్న శ్మశానవాటికలో ఉన్న ముళ్లచెట్లను పొక్లెయిన్‌తో తొలగించి శుభ్రం చేశారు. శ్మశానవాటికల్లో ముళ్ల చెట్లు పెరిగి అంత్యక్రియలకు అసౌకర్యంగా మారింది. దీనిపై 'అంత్యక్రియలకు ఎన్ని అవస్థలో?' శీర్షికన 'ఈనాడు'లో సోమవారం కథనం ప్రచురితమైది. స్పందించిన అధికారులు ముళ్లచెట్లు తొలగించి శుభ్రం చేయించారు.


పొక్లెయిన్‌తో చేస్తున్న పనులు

ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులు ఆరోగ్యానికి ఎంతో మేలు

నరసరావుపేట వ్యవసాయం, న్యూస్‌టుడే : ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులు ఆహారానికి రుచికరంగా ఉండి, ఆరోగ్యానికి మేలు చేస్తాయని డీపీఎం అమలకుమారి అన్నారు. కలెక్టర్ కార్యాలయంలో సోమవారం ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల స్టాల్ ఏర్పాటు చేశారు. దీన్ని ప్రారంభించిన ఆమె మాట్లాడుతూ ప్రతి సోమవారం కలెక్టర్ కార్యాలయం వద్ద స్టాల్ ఏర్పాటు చేసి అనేక రకాల ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులు అందుబాటులో ఉంచుతామని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.


స్టాల్ వద్ద తాజా కూరగాయలను చూపుతున్న డీపీఎం అమలకుమారి తదితరులు

చండీమాతా... నమోస్తుతే



జడ్డావారిపాలెంలో చండీదేవి అలంకరణలో


గంటావారిపాలెంలో మహాచండీగా


చిలకలూరిపేట శారదాంబ ఆలయంలో అన్నపూర్ణాదేవిగా


పసుమర్రు శివాలయంలో అన్నపూర్ణాదేవిగా..

న్యూస్‌టుడే, బృందం : దసరా ఉత్సవాల సందర్భంగా జిల్లాలో శక్తి స్వరూపిణి అయిన అమ్మవారిని వివిధ రూపాల్లో కొలుస్తున్నారు. సోమవారం అమ్మవారికి వివిధ రూపాల్లో అలంకరణలు చేశారు. భక్తులు పెద్దఎత్తున ఆలయాలకు వచ్చి అమ్మవారిని సేవిస్తున్నారు.


విఠంరాజుపల్లిలో మహా చండీదేవిగా అమ్మవారు


మహాకాళిగా రొంపిచర్ల శ్రీ వాసవీఅమ్మవారు


కన్యకా పరమేశ్వరి ఆలయంలో గాయత్రీగా


నరసరావుపేట : పాతూరులో మహాకాళిగా

రేషన్ బియ్యం పట్టివేత


పోలీసులు స్వాధీనం చేసుకున్న బియ్యం తరలింపు వాహనం

చిలకలూరిపేట పట్టణం, న్యూస్‌టుడే : రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్న వాహనాన్ని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి వివరాల మేరకు.. స్థానిక వేలూరు రోడ్డులోని బాలాజీ థియేటర్ వద్ద వాహనంలో బియ్యం తరలిస్తున్నారని సోమవరం సమాచారం రాగా ఎస్సై చెన్నకేశవులు సిబ్బందితో వెళ్లి ట్రాలీ ఆటోను పరిశీలించి.. 50 కిలోల బస్తాలు 60 ఉన్నట్లు గుర్తించారు. వాహనంలో ఉన్న శ్రీను, డ్రైవర్ పురుషోత్తంతో పాటు రేషన్ బియ్యం తరలింపునకు కారణమైన ఏలియాను కూడా అదుపులోకి తీసుకున్నారు.

అన్నీ సమస్యలే

☛ మురుగు పోదు.. వీధి దీపాలు వెలగవు
☛ సీఆర్ కాలనీ వాసుల నరకయాతన


ఖాళీ స్థలంలో కంపచెట్లలో నిలిచిన మురుగు


సీఆర్ కాలనీ 4వ లైన్‌లో రోడ్డుపై వర్షపు నీరు

చిలకలూరిపేట గ్రామీణ, న్యూస్‌టుడే

చిలకలూరిపేట పట్టణ పరిధిలోని సీఆర్ కాలనీలో సమస్యలతో ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాలనీలో ఖాళీ స్థలాల్లో మురుగునీరు, కంపచెట్లు నిలిచి దోమలు వ్యాప్తి చెందుతున్నాయి. కాల్వలు సక్రమంగా లేక మురుగు ముందుకు సాగడం లేదు. కాలనీలోని పలు రోడ్లు దెబ్బతిని చిన్నపాటి వర్షం కురిసినా నీరు నిలిచి రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోంది. కాలనీలో ఉన్న పార్కులో చాలాకాలంగా విద్యుద్దీపాలు వెలగక వ్యాయామం, నడక కోసం వచ్చే వారు చీకట్లోనే తిరగాల్సి వస్తోందని ఆందోళన చెందుతున్నారు. పురపాలకాధికారులు సమస్యలు పరిష్కరించాలని వేడుకుంటున్నారు.

మరమ్మతులు చేపట్టాలి

కాలనీలో చాలాచోట్ల రహదారులు దెబ్బతిన్నాయి. వర్షం పడితే నీరు నిలిచి ఇబ్బంది పడుతున్నాం. కాల్వల్లో సరిగా పూడిక తీయక మురుగు నిలిచి దోమలు వ్యాప్తి చెందుతున్నాయి. దోమల మందు పిచికారీ చేయడం లేదు. నడక, వ్యాయామం కోసం పార్కుకు వెళితే విద్యుద్దీపాలు లేక ఇబ్బందులు పడుతున్నాం. పురపాలక అధికారులు దృష్టి సారించి సమస్య పరిష్కరించాలి.

- బి.రామసుబ్బారావు, సీఆర్ కాలనీ, చిలకలూరిపేట

సమస్యల పరిష్కారానికే ప్రజాదర్బార్


మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు

యడ్లపాడు, న్యూస్‌టుడే : మండల స్థాయి సమస్యల పరిష్కారానికి అధికారులు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజాదర్బార్ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ప్రజలు అందజేసిన 70 అర్జీలను స్వీకరించారు. వాటి పరిష్కరించాలని సంబంధిత శాఖాధికారులను ఆదేశించారు. రైతు సేవా కేంద్రాలో ఎరువులు అందుబాటులో లేవని, ఎరువుల దుకాణాల్లో ఎమ్మార్పీ కన్నా కట్టకు రూ.100 చొప్పున పెంచి రైతులకు అమ్ముతున్నట్లు ఎంపీటీసీ సభ్యుడు ఎం.శ్రీనివాసరెడ్డి తెలిపారు. మైదవోలు పరిధిలోని 401, 414, 415, 413 సర్వే నంబర్లలో 2.32 ఎకరాలు కౌలుకు తీసుకుని సాగు చేసిన పత్తి పంట ఇటీవల వచ్చిన నక్కవాగు వరదతో దెబ్బతిందని, బాధిత రైతులకు నష్ట పరిహారం జమ చేశారని, తనకు అందలేదని యడ్లపాడుకు చెందిన రైతు పోపూరి శివప్రసాద్ అర్జీ అందజేశాడు. అనంతరం వంకాయలపాడులో రూ.16 లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్డు, మురుగు కాలువ పనులకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో తెదేపా నేతలు కామినేని సాయిబాబు, కందిమళ్ల రఘు రామారావు, మద్దినేని వెంకటసుబ్బారావు పోపూరి వెంకయ్య, తహసీల్దార్ విజయశ్రీ, ఎంపీడీవో హేమలత, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

చిలకలూరిపేట పట్టణం, న్యూస్‌టుడే : మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని మహిళా సమాఖ్య ఏరియా కార్యదర్శి చెరుకుపల్లి నిర్మల కోరారు. ఇటీవల బాధ్యతలు స్వీకరించిన మున్సిపల్ కమిషనర్ పి.శ్రీహరిబాబును ఏఐవైఎఫ్ జిల్లా కన్వీనర్ షేక్ సుభాని, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు చెంచయ్య తదితరులు సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పట్టణ పారిశుద్ధ్య మెరుగుకు కార్మికులు పూర్తిస్థాయిలో సహకరిస్తారని వెల్లడించారు.

పాతకక్షలతో వ్యక్తిపై దాడి

చిలకలూరిపేట పట్టణం, న్యూస్‌టుడే : పాత కక్షల నేపథ్యంలో వ్యక్తిపై దాడి జరిగింది. పోలీసుల వివరాల మేరకు... పట్టణంలోని సంజీవ నగర్ ప్రాంతానికి చెందిన టి.వంశీ గతంలో ఎస్.శివనాగేశ్వరరావుపై దాడి చేశాడు. కొన్ని రోజులుగా వంశీ చిలకలూరిపేటలో ఉండటం లేదు. సోమవారం వంశీ సంజీవనగర్‌కు వచ్చాడు. ఇది తెలుసుకున్న శివ నాగేశ్వరరావు తన స్నేహితులతో కలిసి దాడి చేయగా వంశీకి గాయాలయ్యాయి. దీనిపై పట్టణ పోలీసుస్టేషన్‌లో కేసు నమోదైంది.

కలశాలతో ఊరేగింపు


కలశాలతో ఊరేగింపుగా వెళుతున్న మహిళలు

వినుకొండ, న్యూస్‌టుడే : దసరా శరన్నవ రాత్రుల్లో భాగంగా సోమవారం వాసవీ ఆలయంలో ఉదయం మహిళలు జల కలశాలతో ఊరేగింపు వచ్చి నగరోత్సవంలో పాల్గొన్నారు. అనంతరం కుంకుమార్చన నిర్వహించారు. ఈసందర్భంగా సందడి నెలకుంది. ఆర్యవైశ్య సంఘం నాయకులు మిత్తంటి కృష్ణాంజనేయులు, నేరెళ్ల పాపారావు, రమేష్ పాల్గొన్నారు.

లారీ బోల్తా.. ఇద్దరికి గాయాలు


బోల్తా పడిన లారీ

రొంపిచర్ల, న్యూస్‌టుడే : అద్దంకి- నార్కెట్‌పల్లి రాష్ట్రీయ రహదారి పరిధిలోని రొంపిచర్ల మార్కెట్ యార్డు చెక్‌పోస్టు సమీపంలో సోమవారం లారీ బోల్తా పడి లారీ డ్రైవర్, క్లీనర్‌కు గాయాలయ్యాయి. దాచేపల్లి నుంచి చెన్నైకి సున్నం లోడుతో వెళ్తున్న లారీ రొంపిచర్ల మార్కెట్ యార్డు చెక్‌పోస్టు వద్దకు రాగానే డ్రైవర్ నిద్రమత్తులోకి జారుకోగా రోడ్డు పక్కకు దూసుకెళ్లి బోల్తా పడింది. డ్రైవర్‌కు, క్లీనర్‌కు గాయాలు కాగా 108లో నరసరావుపేట వైద్యశాలకు తరలించారు.

భర్త వేధింపులపై కేసు

చీరాల గ్రామీణం, న్యూస్‌టుడే: అదనపు కట్నం కోసం వేధిస్తున్నాడంటూ భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఈపూరుపాలెం పోలీస్ స్టేషన్‌లో సోమవారం భర్తపై కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాలు మేరకు.. ఈపూరుపాలేనికి చెందిన ధనలక్ష్మిని పల్నాడు జిల్లా చిలకలూరిపేట సమీపంలోని గణపవరానికి చెందిన ఏసుబాబుతో నాలుగేళ్ల క్రితం వివాహం చేశారు. ఇటీవల వీరి మధ్య విభేదాలు తలెత్తాయి. అదనపు కట్నం కోసం తనను వేధిస్తున్నాడంటూ భర్తపై చేసిన ఫిర్యాదు మేరకు గృహ హింస కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పచ్చదనం పెంచేందుకు కృషి

వినుకొండ, న్యూస్‌టుడే: పట్టణ సుందరీకరణలో భాగంగా ప్రధాన రహదారుల్లోని డివైడర్లలో పచ్చదనం పెంచేందుకు విత్తన బంతులు నాటుతున్నామని మున్సిపల్ కమిషనర్ సుభాష్ చంద్రబోస్ తెలిపారు. సోమవారం పల్నాడు రోడ్డులో ఆయన కార్యక్రమాన్ని ప్రారంభించారు. వాసవీ వనితా క్లబ్ సభ్యుల సహకారంతో వెయ్యి విత్తన బంతులు (సీడ్ బాల్స్) వినియోగిస్తున్నామని ఆయన తెలిపారు.

బాధ్యతలు చేపట్టిన ఎంపీడీవో

నూజండ్ల : నూజండ్ల ఎంపీడీవోగా ఉమాదేవి సోమవారం బాధ్యతలు చేపట్టారు. అమరావతి మండలం నుంచి నూజండ్లకు ఆమె బదిలీపై వచ్చారు.

మైక్‌సెట్, చేతిరాత పుస్తకాలు అందజేత

చిలకలూరిపేట గ్రామీణ, న్యూస్‌టుడే : మండలంలోని పసుమర్రు జడ్పీ ఉన్నత పాఠశాలకు పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో సోమవారం రూ.27,500 విలువ చేసే పోర్టబుల్ మైక్‌సెట్, ఆంగ్ల చేతిరాతకు సంబంధించి 300 పుస్తకాలు హెచ్‌ఎం హనుమంతరావుకు అందజేశారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థుల సంఘ నాయకులు గద్దె హరిబాబు, ఎస్ఎంసీ ఛైర్మన్ కోట సుదర్శన్‌రావు, వైస్ ఛైర్మన్ షేక్ గౌస్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నూతన వీఆర్వోల బాధ్యతల స్వీకరణ

శావల్యాపురం : సాధారణ బదిలీలల్లో భాగంగా శావల్యాపురం మండలానికి పలువురు గ్రామ రెవెన్యూ అధికారులు బాధ్యతలు స్వీకరించారు. కొత్తలూరు వీఆర్వోగా ఉప్పుటూరి చినమంగయ్య, శానంపూడికి రాధ, శావల్యాపురానికి రమాదేవి, కనమర్లపూడికి నరసింహారావు బాధ్యతలు స్వీకరించినట్లు ఇన్‌ఛార్జి తహసీల్దారు వేముల వెంకట శివ నాగరాజు తెలిపారు.

ఆట్యా పాట్యా పోటీల్లో ప్రథమస్థానం

నరసరావుపేట సెంట్రల్, న్యూస్‌టుడే : నెల్లూరు బీవీఎస్ మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూలులో 5, 6 తేదీల్లో జరిగిన 9వ ఆంధ్రప్రదేశ్ సబ్ జూనియర్ ఆట్యా పాట్యా రాష్ట్రస్థాయి ఛాంపియన్ షిప్-2024 పోటీల్లో పల్నాడు జిల్లా బాలుర, బాలికల జట్లు ప్రథమ స్థానంలో నిలిచినట్లు జిల్లా కార్యదర్శి రోహిత్ జోయల్ తెలిపారు. వీరికి శిక్షకులుగా సీహెచ్ పుల్లయ్య, జి.ఝాన్సీరాణి వ్యవహరించారు. జట్లను రాష్ట్ర సీఈవో దుర్గాప్రసాద్, రాష్ట్ర అధ్యక్షుడు జూబేజ్, కార్యదర్శి శ్రీచరణ్, జిల్లా కార్యదర్శులు అభినందించారు.


విజేత బాలుర, బాలికల జట్లు

రాష్ట్రస్థాయిలో విద్యార్థుల ప్రతిభ

చిలకలూరిపేట గ్రామీణ, న్యూస్‌టుడే : అథ్లెటిక్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో రాజమండ్రిలో జరిగిన రాష్ట్రస్థాయి పరుగు పోటీల్లో మండలంలోని రాజాపేట ఏపీ గురుకుల పాఠశాల విద్యార్థి సాయిరాంకు కాంస్య పతకం లభించింది. అదే విధంగా పెనుమాకలో నిర్వహించిన ఉమ్మడి గుంటూరు జిల్లా ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన 400 పరుగు పందెం, 400 మీటర్ల హర్డిల్‌రేస్, 400 మీటర్ల రిలే, 5 వేల మీటర్ల నడక, 110 మీటర్ల హర్డిల్ రేస్, షాట్‌పుట్ పోటీల్లో విద్యార్థులు టి.సాయిరాం, కె.వంశీ, కె.జశ్వంత్, కె.చంద్రశేఖర్, ఒ.వి. నీలయ్య, శివనాగరాజు, బి.నాగార్జున, జి.వి.నాగరాజు ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. విద్యార్థులను ప్రిన్సిపల్ సుబ్రహ్మణ్యం, పీఈటీ రాజు, ఉపాధ్యాయులు అభినందించారు.


సాయిరాంతో పీఈటీ రాజు

అవీ ఇవీ

గ్రామాభివృద్ధిలో పాలు పంచుకోవాలి

శావల్యాపురం : పంచాయతీల అభివృద్ధిలో వార్డు సభ్యులు సహకారం అందిస్తే పంచాయతీలు సర్వతోముఖాభివృద్ధి చెందుతాయని ఎంపీడీవో పేరుమీన సీతారామయ్య తెలిపారు. సోమవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో వార్డు సభ్యులు, ఉప సర్పంచులకు రెండు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు.

గుంటుపాలెం ఉప సర్పంచి రాజీనామా

గుంటుపాలెం (శావల్యాపురం) : మండలంలోని గుంటుపాలెం ఉప సర్పంచి నారు సుబ్బారెడ్డి సోమవారం తన పదవికి రాజీనామా చేసినట్లు ఎంపీడీవో పేరుమీన సీతారామయ్య తెలిపారు. ఎన్నికల ఒప్పందంలో భాగంగా ఆయన రాజీనామా చేశారు.

శాంతి ఆశ్రమంలో సప్తరుషి పూజ

వినుకొండ రూరల్, న్యూస్‌టుడే : విఠంరాజుపల్లిలోని శాంతి ఆశ్రమం వద్ద హిమాలయ గురూజీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న దేవీ నవరాత్రుల్లో భాగంగా ఐదో రోజు హిమాలయ గురూజీ సప్త రుషి పూజ నిర్వహించారు. తొమ్మిది రోజుల పాటు నిర్వహించే రాజశ్యామల యాగంలో శ్రీశైలానికి చెందిన స్వామీజీ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.

విద్యార్థుల ర్యాలీ


ప్రదర్శనగా వెళుతున్న విద్యార్థులు

నరసరావుపేట అర్బన్: ఇస్రో ఆధ్వర్యంలో నరసరావుపేట ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహిస్తున్న అంతరిక్ష వారోత్సవాల సందర్భంగా సోమవారం ఉదయం పట్టణంలో పాఠశాల విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. వారోత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన ప్రదర్శన తిలకించాలని కోరుతూ అవగాహన ర్యాలీ ఏర్పాటు చేశారు

మృతులకు నివాళి.. బాధితులకు పరామర్శ

యడ్లపాడు : తెదేపా రాష్ట్ర ఉపాధ్యక్షుడు, ఎమ్మెల్యే ప్రత్తిపాటి ప్రత్తిపాటి పుల్లారావు సోమవారం మండలంలో పర్యటించారు. ఉన్నవలో తెదేపా నేత సాధినేని రాఘవయ్య దశదిన కర్మ కార్యక్రమానికి హాజరై ఆయన చిత్రపటానికి నివాళి అర్పించారు. వంకాయలపాడులో అనారోగ్యంతో బాధపడుతున్న షేక్ నాగూర్‌వలిని పరామర్శించారు. ఉప్పరపాలెంలో పల్లపు శ్రీను మృతదేహానికి నివాళి అర్పించారు.

సత్తెనపల్లి

• సత్తెనపల్లి • పెదకూరపాడు • మాచర్ల • గురజాల

విద్యార్థినికి ఆర్థిక చేయూత



నగదు అందజేస్తున్న దాతలు

పిడుగురాళ్ల, న్యూస్‌టుడే: లైమ్‌సిటీ రోటరీక్లబ్ సహకారంతో విద్యార్థినికి రూ.1.5 లక్షల ఆర్థిక సహాయం సోమవారం చేశారు. పట్టణానికి చెందిన పల్లబోతుల లక్ష్మీ నిఖిత విశాఖపట్నంలోని ఆంధ్రా మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ రెండో సంవత్సరం చదువుతోంది. విద్యార్థిని కళాశాల ఫీజు చెల్లించటానికి కొత్త సాయికృష్ణ, డాక్టరు యక్కల సురేష్ ఆర్థిక సహాయం చేశారు. క్లబ్ అధ్యక్షుడు గుండా అశోక్‌బాబు, కార్యదర్శి నీరుమళ్ల రాజేష్, కోశాధికారి వైద్యులు గుర్రం కృష్ణకాంత్, క్లబ్ సభ్యుల ద్వారా నగదు అందజేశారు.

వ్యవస్థల్ని చక్కదిద్దుతున్నాం



గ్రామంలో పర్యటిస్తున్న కొమ్మాలపాటి శ్రీధర్, నాయకులు

వేల్పూరు(అచ్చంపేట), న్యూస్‌టుడే: జగన్ భ్రష్టుపట్టించిన వ్యవస్థలన్నింటినీ కూటమి ప్రభుత్వం చక్కదిద్దుతూ ప్రజారంజక పాలన అందిస్తుందని తెదేపా జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్ అన్నారు. సోమవారం ఆయన మండలంలోని వేల్పూరులో విలేకరులతో మాట్లాడారు. రానున్న శాసనమండలి ఎన్నికల్లో కూటమి అభ్యర్థిని గెలిపించేందుకు పార్టీ నాయకులు కృషి చేయాలని కోరారు. అనంతరం గ్రామంలో పర్యటించారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

సత్తెనపల్లి: 80085 73171 పెదకూరపాడు: 80088 31888
మాచర్ల గ్రామీణ: 80085 73181 గురజాల: 80085 7 3176

? గోగులపాడులోని సచివాలయం పక్కన చెత్త, చెదారం పేరుకు పోయింది. అధికారులు స్పందించి చెత్త తొలగించాలి. **- స్థానికులు**

✔ చెత్త, చెదారాన్ని తొలగిస్తాం. **- మల్లికార్జునరావు, గోగులపాడు**

? గంగవరంలోని శివాలయం ఆవరణలోకి మురుగు నీరు వస్తోంది. **- అర్జునుడు**

✔ పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటాం. **- లక్ష్మీ, కార్యదర్శి, గంగవరం** - న్యూస్‌టుడే, గురజాల గ్రామీణ

? ఆర్యవైశ్య వీధిలోని సత్యసాయి మందిర ప్రాంతంలో మురుగు కాలువలు వ్యర్థాలతో నిండిపోయాయి. దుర్వాసనతోపాటు వ్యాధి కారకాలు పెరిగి ఇబ్బందులు పడుతున్నాం. **- శ్రీను, కారంపూడి**

✔ కాలువలు శుభ్రం చేసే పనులు జరుగుతున్నాయి. ఆ ప్రాంతంలోనూ పనులు చేయిస్తాం.
- కశిన్యానాయక్, కార్యదర్శి - న్యూస్‌టుడే, కారంపూడి

క్రీడా వికాసంపై దృష్టి

కేవీకేల పూర్తికి చర్యలు

సత్తెనపల్లి, మాచర్ల, న్యూస్‌టుడే

గత అయిదేళ్ల వైకాపా పాలనలో క్రీడాభివృద్ధి మాటలకే పరిమితమైంది. గతంలో ప్రారంభించి చివరి దశలో ఉన్న స్టేడియాల నిర్మాణాల్ని పట్టించుకోకపోగా.. కొత్త వాటిపైనా జగన్ ప్రభుత్వం శ్రద్ధ చూపించలేదు. మరోవైపు డబ్బులు చెల్లించేలా పే అండ్ ప్లే విధానాన్ని అమలు చేశారు. దీంతో గ్రామీణ ప్రాంతాల్లోని మట్టిలో మాణిక్యాలు క్రీడలకు దూరమయ్యారు. తాజాగా క్రీడాభివృద్ధిపై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సమీక్ష నిర్వహించారు. ఇందులో ప్రధానంగా 40 శాతం పైబడి నిర్మాణాలు పూర్తయిన క్రీడా వికాస కేంద్రాల్ని(కేవీకే) వెంటనే వాడుకలోకి తీసుకురావాలని ఉన్నతాధికారులకు ఆదేశాలు చేశారు. దీంతో శాప్ అధికారులు కేవీకేల పరిస్థితిపై ఉన్నతస్థాయికి నివేదిక అందించారు. త్వరలోనే అసంపూర్తి నిర్మాణాల పూర్తికి పనులు ప్రారంభం కానున్నాయి.



తుది దశలో ఆగిన ఇండోర్ స్టేడియం నిర్మాణం

వైకాపా ప్రభుత్వం నిర్లక్ష్యం

జిల్లా క్రీడాప్రాధికార సంస్థ(శాప్) ఆధ్వర్యంలో సత్తెనపల్లిలో క్రీడా వికాస కేంద్రం (స్టేడియం) నిర్మాణాన్ని దశాబ్దన్నర క్రితం ప్రారంభించారు. తొలుత రూ.2.10 కోట్ల మినీ స్టేడియం పనుల్ని ప్రారంభించారు. సగంలో ఆగిపోయిన పనుల్ని మళ్లీ గాడినపెట్టేలా గత తెదేపా ప్రభుత్వ హయాంలో మేజర్ స్టేడియంగా మార్చారు. ఐదెకరాల క్రీడా మైదానాన్ని పదెకరాలకు పెంచారు. ఈ క్రమంలో తాత్కాలిక నివాసాల్ని కూడా తొలగింపజేశారు. స్టేడియంలో ఓ భాగంలో ఈత కొలను నిర్మాణ పనులు చేపట్టారు. మొత్తం రూ.6.50 కోట్లు మంజూరై పనులు 80 శాతం మేరకు పూర్తయ్యాయి. ఆ తర్వాత వైకాపా ప్రభుత్వం స్టేడియాన్ని అటకెక్కించింది. పెవిలియన్, ఇండోర్ స్టేడియం నిర్మాణాలు పూర్తయి తుదిదశ పనులు చేపట్టాల్సి ఉన్నా వాటిని ఐదేళ్లుగా పట్టించుకోలేదు. ఎన్నికల సమయంలో పిచ్చిచెట్లను తొలగించే పనుల్ని చేపట్టి మమ అనిపించారు. తుది దశ పనులు పూర్తి చేస్తే పల్నాడు ప్రాంత క్రీడాకారులకు ఎంతో ఉపయుక్తంగా ఉంటుంది.

నిర్మాణం పూర్తయినా..

మాచర్లలో క్రీడా వికాస కేంద్రం పనులు ఆరేళ్ల క్రితమే పూర్తయినా పూర్తి స్థాయిలో వాడుకలోకి తీసుకురాలేదు. ముళ్లకంపలు, పిచ్చిచెట్లతో మైదానం నిండి ఉంది. స్టేడియం ముందుభాగంలో నిర్మించిన భవనాలు వృథాగా ఉన్నాయి. స్టేడియం ఉన్నా.. విద్యార్థులు, యువత, క్రీడాకారులు ఆటలకు దూరంగా ఉండాల్సి వస్తోంది. చిన్నచిన్న పనులు పూర్తి చేస్తే ఇక్కడ వెంటనే క్రీడా మైదానం వాడుకలోకి వచ్చే అవకాశముంది.

అన్ని ప్రాంతాల్లోనూ అంతే..

నియోజకవర్గానికి ఒకటి చొప్పున క్రీడా వికాస కేంద్రం నిర్మించాలన్నది కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆలోచన. జిల్లాలో చిలకలూరిపేట, వినుకొండ, గురజాల, పెదకూరపాడు నియోజకవర్గాల్లో ఇప్పటివరకు స్టేడియం నిర్మాణాల ఊసే లేదు. నరసరావుపేట మినహాయించి మిగిలిన ఆరు నియోజకవర్గాల్లోనూ ఆడుకునేందుకు మైదానాల్లేవు. జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేట్ యాజమాన్యాల్లో కలిపి 2046 పాఠశాలలు ఉన్నాయి. వీటిలో క్రీడా మైదానాలు ఉన్న బడులు 300లోపే ఉన్నాయి. గత తెదేపా ప్రభుత్వ హయాంలో ఉపాధి నిధులతో మండలానికి రెండు, మూడు ప్రభుత్వ పాఠశాలల మైదానాల అభివృద్ధి పనులు చేపట్టారు. క్రీడా వికాస కేంద్రాల్ని అందుబాటులోకి తీసుకురావడంతోపాటు ఉపాధి నిధులతో గ్రామీణ ప్రాంతాల్లోని పాఠశాలల మైదానాల రూపురేఖలు మారిస్తే క్రీడాపరమైన ప్రగతి సాధ్యమవుతుంది. వివిధ దశల్లో ఉన్న కేవీకేల పనులు పూర్తిచేసి వాడుకలోకి తీసుకొచ్చేందుకు ప్రణాళికలు రూపకల్పన చేసినట్లు శాప్ అధికారులు తెలిపారు.

విద్యుత్తు నూతన లైన్ ప్రారంభం

మాచర్ల (కారంపూడి), న్యూస్‌టుడే: విద్యుత్తు సమస్యల పరిష్కారానికి మాచర్లలోని రింగురోడ్డు సబ్ స్టేషన్ నుంచి కొత్తపల్లి జంక్షన్ వరకు నూతన లైన్ ఏర్పాటు చేశామని ఎస్ఈ విజయ్‌కుమార్ తెలిపారు. సోమవారం ఆయన కొత్త లైన్ ప్రారంభించారు. రూ.53.41 లక్షలతో ఏర్పాటు చేసిన లైన్‌తో నాగార్జునసాగర్ డ్యాం వద్దకు అధికలోడు తగ్గుతుందని, కొప్పునూరు, ద్వారకాపురి, మంచికల్లు, తాళ్లపల్లి, పట్టణంలోని పాతమాచర్ల, రైల్వేగేట్, జమ్మలమడక, గన్నవరం సబ్‌స్టేషన్ పరిధిలోని వినియోగదారులు, రైతులకు నాణ్యమైన విద్యుత్తు సరఫరా అవుతుందన్నారు. ఇన్‌ఛార్జి డీఈ రాంబట్టు, ఏడీఈ రామయ్య, కోటేశ్వరరావు, ఎల్ఎం మంత్రూనాయక్, రెడ్యానాయక్ తదితరులు పాల్గొన్నారు.

నేడు సత్తెనపల్లిలో ప్రజాదర్బార్

సత్తెనపల్లి, న్యూస్‌టుడే: పట్టణంలోని 24వ వార్డు పాతసాలిపేట సచివాలయం వద్ద మంగళవారం ఉదయం 11 గంటలకు ప్రజా సమస్యల పరిష్కార కార్యక్రమం (ప్రజాదర్బార్) నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ కార్యాలయవర్గాలు వెల్లడించాయి. ప్రజలు హాజరై సమస్యల్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకురావాలని తెదేపా నాయకులు కోరారు.

గురజాల కమిషనరుగా శ్రీనివాసరావు



గురజాల, న్యూస్‌టుడే: గురజాల నగర పంచాయతీ కమిషనరుగా శ్రీనివాసరావు బాధ్యతలు తీసుకున్నారు. పిడుగురాళ్ల మున్సిపాల్టీలో డీఈగా పనిచేస్తున్న శ్రీనివాసరావు గురజాల నగర పంచాయతీకి బదిలీ అయ్యారు. డీఈ విధులతోపాటు కమిషనరుగా పనిచేయాలని ఆదేశాలు జారీ చేశారు. నగర పంచాయతీ అభివృద్ధిపై దృష్టి సారిస్తానని ఆయన తెలిపారు.

తెదేపా నాయకులపై కేసు కొట్టివేత

సత్తెనపల్లి, న్యూస్‌టుడే: తెదేపా నాయకులపై నమోదైన కేసును కొట్టివేస్తూ మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి ప్రియదర్శిని సోమవారం తీర్పు ఇచ్చారని స్థానిక న్యాయవాది పూజల వెంకట కోటయ్య తెలిపారు. సార్వత్రిక ఎన్నికల సందర్భంగా రాజుపాలెం మండలం ఇనిమెట్లలో మాజీ సభాపతి డాక్టర్ కోడెల శివప్రసాదరావుపై జరిగిన దాడిని నిరసిస్తూ మున్సిపల్ మాజీ ఛైర్మన్ యెల్లినేడి రామస్వామి ఆధ్వర్యంలో తెదేపా నాయకులు పట్టణంలో ధర్నా చేశారు. దీనిపై 2019 ఏప్రిల్ 13వ తేదిన కేసు నమోదైంది. ఈ కేసులో మోపబడిన అభియోగాలు రుజువు కాకపోవడంతో కేసు కొట్టివేస్తూ జడ్జి తీర్పు ఇచ్చారు.

ఆలయ పునర్నిర్మాణానికి నిధులు

ముప్పాళ్ల, న్యూస్‌టుడే: మండలంలోని దమ్మాలపాడులో కోదండరామస్వామి ఆలయ పునర్నిర్మాణానికి దేవాదాయశాఖ నుంచి నిధులు మంజూరయ్యాయి. 200 ఏళ్ల చరిత్ర కలిగిన ఆలయ పనులు త్వరలోనే మొదలవ్వనున్నాయి. రూ.1.10 కోట్ల ప్రభుత్వ నిధులకు తోడు గ్రామస్థులు విరాళాలు సేకరించారు.

రాజగోపుర కలశ ప్రతిష్ఠ ఉత్సవాలు

విజయపురిసౌత్, న్యూస్‌టుడే: విజయపురిసౌత్‌లోని సీతారామాలయం రాజగోపుర శిఖర కలశ ప్రతిష్ఠ మహోత్సవం సోమవారం ప్రారంభమైంది. కోలా సుబ్బారెడ్డి, నాగమ్మ కుటుంబ సభ్యుల సహకారంతో సుమారు రూ.కోటి వెచ్చించి ఆలయానికి రాజగోపుర శిఖర కలశాన్ని ఏర్పాటు చేశారు. ఈనెల 9న బ్రహ్మశ్రీ వేదమూర్తులు వట్టిపల్లి కృష్ణమూర్తి ఆధ్వర్యంలో కలశ ప్రతిష్ఠ జరగనుంది.

ఎమ్మెల్సీ అభ్యర్థిని గెలిపించండి



నకరికల్లులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ

నకరికల్లు, న్యూస్‌టుడే: నకరికల్లు తెదేపా కార్యాలయంలో మండలంలోని ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ హాజరై మాట్లాడుతూ కూటమి తరపున పట్టభద్రుల ఎన్నికల్లో ఉమ్మడి కృష్ణ, గుంటూరు జిల్లాల ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను గెలిపించేందుకు అందరూ కష్టపడి పనిచేయాలన్నారు. పట్టభద్రులు ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు. జడ్పీటీసీ సభ్యుడు హరీష్, నాయకులు శ్రీను, వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

సత్తెనపల్లి: పట్టభద్ర ఓటరుగా నమోదవ్వండి.. ఓటుహక్కు వినియోగించుకోవాలంటూ వైద్యులకు ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అవగాహన కల్పించారు. పట్టణంలోని ప్రైవేట్ వైద్యులను సోమవారం ఎమ్మెల్యే కన్నా కలిసి పట్టభద్రులుగా ఓటు నమోదుకు ఫారం-18లను అందజేశారు.

పద్మశాలి సంక్షేమ కార్పొరేషన్ ఛైర్మన్‌కు సత్కారం

పద్మశాలి సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ రాష్ట్ర ఛైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన అబద్దయ్యను ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ సత్కరించారు. మంగళగిరిలో సోమవారం ఆయనను కన్నా కలిసి అభినందించారు.

దుకాణాల్లో తనిఖీలు

సత్తెనపల్లి గ్రామీణ, న్యూస్‌టుడే: సత్తెనపల్లిలోని కొన్ని దుకాణాల్లో తూనికలు కొలతల శాఖ ఇన్‌స్పెక్టర్ షేక్ జాన్‌సైదా సోమవారం ఆకస్మికంగా తనిఖీలు చేశారు. నిత్యావసర సరకులు, చౌకధరల దుకాణాలు, ఎండీయూ వాహనాల్లో సరకు, నరసరావుపేట రోడ్డులోని కొన్ని చికెన్ విక్రయ దుకాణాల్లో తూకాలను పరిశీలించారు. బియ్యం బస్తాల బరువును గమనించారు. 25 కిలోల బస్తాలకుగాను 24 కిలోలు ఉన్నట్లు నిర్ధరించారు. ఈ మేరకు ఏడు దుకాణాలపై కేసులు నమోదు చేసి అపరాధ రుసుం విధించినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

అనుసంధాన రోడ్లు నిర్మించాలి

ముప్పాళ్ల, న్యూస్‌టుడే: మండలంలోని మాదల నుంచి ఎన్నాదేవి, ధూళిపాళ్లకు అనుసంధాన రోడ్ల నిర్మాణాల్ని చేపట్టాలని సీపీఎం మండల కార్యదర్శి జి.బాలకృష్ణ ప్రభుత్వాన్ని కోరారు. మాదలలో సోమవారం ఏర్పాటు చేసిన పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులు, కౌలుదార్లకు తక్షణమే రైతుబంధు పథకాన్ని అమలు చేయాలని, భూమి యజమానితో సంబంధం లేకుండా కౌలు రైతులకు బ్యాంకుల ద్వారా రుణాలు ఇవ్వాలని కోరారు. నాయకులు వెంకటేశ్వర్లు, ఆంజనేయులునాయక్, సైదాఖాన్, వెంకటరెడ్డి, జాలయ్య తదితరులు పాల్గొన్నారు.

వీధి కుక్కల దాడిలో ఆరుగురికి తీవ్రగాయాలు

నకరికల్లు, న్యూస్‌టుడే: నకరికల్లు సినిమాహాలు వీధిలో కుక్కల కాటుకు ఐదుగురు, శివాపురం తండాలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. వారిని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు తరలించి చికిత్స అందించారు. అధికారులు వెంటనే స్పందించి వీధి కుక్కలను పట్టుకుని జంతు రక్షణ నిలయానికి తరలించారు.

అభివృద్ధికి నోచని అంతర్గత రహదారులు



సత్తెనపల్లి మండలం గుడిపూడిలోని ఎస్టీకాలనీ వాసుల కష్టాలకు నిదర్శనమీ చిత్రం. కాలనీ ఏర్పడి రెండు దశాబ్దాలు గడిచినా అంతర్గత రహదారులకు నోచలేదు. చిన్నపాటి వర్షానికే దారులన్నీ బురదగా మారుతున్నాయి. ఇళ్ల నుంచి బయటకు రావాలంటేనే భయపడుతున్నారు. కొందరు ఇళ్ల ఎదుట గ్రావెల్‌తో చదును చేసుకున్నారు. బురద నీటిలో నడవలేక ఓ వీధిలో రెల్లు గడ్డితో బాట ఏర్పాటు చేసుకున్నారు. అధికారులు స్పందించి కాలనీలో సీసీ రోడ్లు నిర్మించాలని కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, సత్తెనపల్లి గ్రామీణ**



సత్తెనపల్లి: మహాచండి అలంకారంలో అమ్మవారు



మాచవరం: నారసింహ అవతారం



మహిషాసురమర్దినిగా రేణుక అమ్మవారు



అచ్చంపేట వాసవీ కన్యకాపరమేశ్వరి



అచ్చంపేట సీతారామ స్వామి ఆలయంలో..



క్రోసూరు: అన్నపూర్ణ దేవిగా వాసవీమాత

దుర్గమ్మా.. చల్లగ చూడమ్మా




విజయపురిసౌత్‌లో కాత్యాయనీదేవి

దసరా ఉత్సవాలు కనులపండువగా జరుగుతున్నాయి. అమ్మవారి ఆలయాల్లో అభిషేకాలు, పూజలు నిర్వహిస్తున్నారు. అమ్మవారు రోజుకో అలంకరణలో భక్తులకు దర్శనమిస్తున్నారు. సోమవారం విశేష అలంకారం చేసి పూజలు చేశారు.

– న్యూస్‌టుడే, బృందం



పిడుగురాళ్ల: కృష్ణావతారంలో శ్రీవారు



పిడుగురాళ్ల: మహా చండీదేవిగా కనకదుర్గమ్మ



పిడుగురాళ్ల: అన్నపూర్ణాదేవి



బెల్లంకొండలో మహాచండీగా




సత్తెనపల్లి: త్రిశక్తి దుర్గాపీఠంలో..



సత్తెనపల్లి: నీలంపాటి శ్రీలక్ష్మి అమ్మవారు



పిడుగురాళ్ల: మహాలక్ష్మమ్మ ఆలయంలో కుంకుమపూజ



గురజాల గ్రామీణ: కనకదుర్గ ఆలయంలో శాకాంబరి



కొమెరపూడిలో చండీదేవి



మాచర్లలో వాసవీ అమ్మవారు



రెంటచింతల: గాయత్రీ దేవిగా భ్రమరాంబ

పల్లెల ప్రగతిలో పంచాయతీరాజ్ వ్యవస్థ కీలకం

అచ్చంపేట, న్యూస్‌టుడే: గ్రామసీమల అభివృద్ధిలో పంచాయతీరాజ్ వ్యవస్థ కీలకమని ఈవోపీఆర్డీ వీర్రాజు తెలిపారు. సోమవారం ఆయన మండలంలోని వార్డు సభ్యులు, ఉపసర్పంచులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. శిక్షణను ఎంపీడీవో శ్రీనివాసరావు ప్రారంభించారు. మాస్టర్ ట్రైనర్ మాంజీనాయక్, వీర్రాజు పంచాయతీ పరిపాలన, వ్యవస్థ, వనరుల పరిరక్షణ, ఆర్టీఐ యాక్టు, లేఅవుట్లు, కోర్టు వ్యవహారాలు సంబంధించిన అంశాల గురించి వివరించారు.

★ క్రోసూరు ఎంపీడీవో కార్యాలయంలో వార్డుసభ్యులు, ఉపసర్పంచుల శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయి. ఎంపీడీవో మహేష్‌బాబు, ఈవోపీఆర్డీ వెంకయ్య తదితరులు మాట్లాడారు. గ్రామాల ప్రగతికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని కోరారు. పంచాయతీల వనరులను కాపాడుతూ సంపద సృష్టిపై దృష్టి పెట్టాలని సూచించారు.

పలువురు బాధ్యతల స్వీకరణ

పిడుగురాళ్ల, మాచవరం, న్యూస్‌టుడే: పట్టణ ఎస్సైగా శివనాగరాజు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. దాచేపల్లి పోలీసుస్టేషన్‌లో ఎస్సైగా పనిచేస్తూ బదిలీపై ఇక్కడకు వచ్చారు. దాంతోపాటు మండల డిప్యూటీ తహసీల్దారుగా సుధాకర్‌శర్మ బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేసే డిప్యూటీ తహసీల్దారు ఎన్.ధనలక్ష్మీ నాదెండ్ల మండలానికి బదిలీ అయ్యారు. మాచవరం మండలం డిప్యూటీ తహసీల్దారుగా ఎం.కె.స్రవంతి బాధ్యతలు స్వీకరించారు. కారంపూడి మండలం డిప్యూటీ తహసీల్దారుగా ఆమె పనిచేస్తూ బదిలీపై ఇక్కడకు వచ్చారు.

జీవన ఎరువుతో భూసారం



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఉపసంచాలకులు శివకుమారి

పెదకూరపాడు, న్యూస్‌టుడే: మొక్క జీవనానికి, భూసారానికి జీవ ఎరువులు ఆదరువుగా నిలుస్తాయని నరసరావుపేట ఉపసంచాలకులు శివకుమారి అన్నారు. పెదకూరపాడు రైతు భరోసా కేంద్రంలో సోమవారం కృషి వికాస్ యోజన ద్వారా అన్నదాతలకు జీవన ఎరువులపై అవగాహన కల్పించారు. పత్తిలో గులాబిరంగు పురుగు నివారణ చర్యలు తదితర అంశాలపై వివరించారు. ఏఓ శాంతి, విస్తరణాధికారి శేషుబాబు తదితరులు పాల్గొన్నారు.

సిబ్బందిలేక రోగులకు ఇబ్బందులు

పెదకూరపాడు, న్యూస్‌టుడే: పెదకూరపాడు సామాజిక ఆరోగ్యకేంద్రంలో వైద్యులు, సిబ్బంది లేక రోగులు ఇబ్బందులు పడుతున్నారని గ్రామస్థులు తహసీల్దారు దానియేలుకు విన్నవించారు. సోమవారం తహసీల్దారు కార్యాలయంలో నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార కార్యక్రమంలో పలువురు వినతులు ఇచ్చారు. రూ.8 కోట్లతో నిర్మించిన నూతన ఆసుపత్రిలో వైద్యసేవలను ప్రారంభించాలని, ఖాళీగా ఉన్న గైనకాలజిస్ట్, జనరల్ సర్జన్, ఎనస్తీషియా, డాటా ఎంట్రీ ఆపరేటర్‌ను నియమించాలని కోరారు.

మహిళల రక్షణకు చట్టాలు




మాట్లాడుతున్న రిసోర్స్ పర్సన్ రెహ్మాని

సత్తెనపల్లి, న్యూస్‌టుడే: మహిళల రక్షణకు పటిష్టమైన చట్టాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్నాయని, ఇంటా, బయట మహిళలు స్వేచ్ఛగా జీవించే వాతావరణాన్ని కల్పిస్తున్నాయని రిసోర్స్ పర్సన్ అమీన రెహ్మాని అన్నారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ, జాతీయ న్యాయసేవాధికార సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో పట్టణంలోని తితిదే కల్యాణ మండపంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. భ్రూణ హత్యలు, లింగనిర్ధారణ చట్టాలు, ఆస్తి హక్కులు, పోక్సో చట్టంపై అవగాహన కల్పించారు. మహిళలకు ప్రోత్సాహకాలను అందజేశారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ రిసోర్సు పర్సన్ ఝాన్సీ, మున్సిపల్ కార్యాలయ మేనేజర్ సాంబశివరావు, న్యాయవాదులు శ్రీనివాసరావు, కోటేశ్వరరావు, అమర్‌నాయక్, వెంకటశివ, పారా లీగల్ వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

దాచేపల్లిలో చోరీలపై నిఘా

సీసీ కెమెరాల మరమ్మతులకు చర్యలు

దాచేపల్లి, న్యూస్‌టుడే



దాచేపల్లిలో సీసీ కెమెరాలు

దాచేపల్లిలో నిఘా వ్యవస్థ పటిష్టతకు అడుగులు పడుతున్నాయి. పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు. దొంగలు, పాత నేరస్థులు, సంఘవిద్రోహుల కదలికలను పసిగట్టడానికి గతంలోనే దాచేపల్లిలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. ప్రమాదాలు, చోరీలు, అల్లర్లు, ట్రాఫిక్ సమస్యలు తలెత్తినప్పుడు తక్షణం గుర్తించి, పోలీసులు క్షణాల్లో అక్కడికి చేరుకునేందుకు నిఘా నేత్రాలు దోహదపడ్డాయి. గత వైకాపా ప్రభుత్వ హయాంలో నిఘా వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. సరైన నిర్వహణ లేక కెమెరాలు అలంకారప్రాయంగా మిగిలాయి. చోరీలు జరిగినప్పుడు దొంగలను గుర్తించడం కష్టంగా మారింది. ఎక్కడైనా నివాసాలు, దుకాణాల్లో సీసీ కెమెరాలు ఉంటే తప్ప నిందితుల వివరాలు సేకరించలేని పరిస్థితి ఏర్పడింది.

రూ.లక్షలు వెచ్చించి..: దాచేపల్లి పట్టణంలో నిఘా వ్యవస్థను బలోపేతం చేసే క్రమంలో రెండున్నరేళ్ల కిందట రూ.లక్షలు విరాళాలు సేకరించారు. ఆ సొమ్ముతో పట్టణ పరిధి, ప్రధాన కూడళ్లు, రహదారులు, సమస్యాత్మక ప్రాంతాల్లో 32 సీసీ కెమెరాలు అమర్చారు. సీసీ ఫుటేజీ పరిశీలించడానికి వీలుగా పోలీస్ స్టేషన్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు. కొంతకాలం వరకు పని చేశాయి. కాలక్రమేణా నిర్వహణ లేక 28 సీసీ కెమెరాలు పడకేశాయి. గత మూడు నెలలుగా దాచేపల్లిలో వరుస చోరీలు జరిగాయి. దొంగలను గుర్తించడం పోలీసులకు సవాలుగా మారింది.

శాంతి భద్రతలకు ప్రాధాన్యం

కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక శాంతి భద్రతలకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారు. ఈక్రమంలోనే దాచేపల్లి సీఐ గుత్తి వెంకట్రావు, ఎస్సై పాపారావు పోలీసు సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. గతంలో ఎక్కడెక్కడ సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు.. వాటి పనితీరుపై ఆరా తీశారు. పట్టణంలో సమస్యాత్మక ప్రాంతాలు, ప్రధాన కూడలి, జాతీయ రహదారిపై నిఘా కెమెరాలకు వెంటనే మరమ్మతులు చేయించాలని సూచించారు. అవసరమైన చోట అదనంగా సీసీ కెమెరాల ఏర్పాటుకు ప్రతిపాదనలు చేయాలని తెలిపారు.

ఈనాడు ప్రతిభ
pratibha.eenadu.net/eenadupratibha.net
విద్య, ఉద్యోగ పరీక్షల ప్రత్యేకం!

కరెంట్ అఫైర్స్

మాదిరి ప్రశ్నలు



■ భారత మహిళల క్రికెట్ జట్టు ఇటీవల చెన్నైలో ఏ జట్టుతో జరిగిన ఏకైక టెస్టు మ్యాచ్‌లో తొలిరోజు ఏకంగా 525 పరుగులు చేసి ప్రపంచ రికార్డు సృష్టించింది? (టెస్టు క్రికెట్ (పురుషులు కలిపి) చరిత్రలోనే మొదటిరోజు అత్యధిక పరుగులు చేసిన జట్టుగా భారత మహిళల జట్టు నిలిచింది. ఈ మ్యాచ్‌లో భారత క్రికెటర్ షెఫాలీ వర్మ టెస్టుల్లో తొలి శతకాన్నే ద్విశతకంగా మార్చింది. 194 బంతుల్లో 205 పరుగులు చేసి మహిళల టెస్టుల్లో అత్యంత వేగంగా ద్విశతకం సాధించిన క్రీడాకారిణిగా రికార్డు సృష్టించింది.) **జ:** దక్షిణాఫ్రికా

■ 18వ, ప్రస్తుత లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా ఏ రాష్ట్రంలోని 'కోట' స్థానం నుంచి బీజేపీ తరఫున ఎంపీగా గెలుపొందారు? (మాడభూషి అనంతశయనం అయ్యంగార్, గుర్‌దయాళ్ సింగ్ ఢిల్లాన్, బలరాం జాఖడ్, జీఎంసీ బాలయోగి తర్వాత రెండోసారి స్పీకర్ పదవి చేపట్టిన వ్యక్తిగా ఓం బిర్లా రికార్డు సృష్టించారు. తొలి విడతలో అయిదేళ్ల పదవీకాలం పూర్తిచేసుకుని వరుసగా రెండోసారి స్పీకర్ పదవి చేపట్టిన తొలివ్యక్తి బలరాం జాఖడ్ కాగా ఓం బిర్లా ఆ కోవలో రెండో వ్యక్తి.) **జ:** రాజస్థాన్

■ చంద్రుడి అవతలి వైపు భాగంలోని మట్టిని భూమి పైకి సురక్షితంగా చేర్చిన మొదటి దేశంగా ఏది రికార్డు సృష్టించింది? **జ:** చైనా

మరింత సమాచారం

ప్రిపరేషన్ టెక్నిక్

ప్రతి సబ్జెక్టు లేదా పాఠాన్ని అధ్యయనం చేయడానికి నిర్ణీత కాలాన్ని కేటాయించుకోవాలి. ఆ టైమ్‌లోగా పూర్తిచేయడానికి ప్రయత్నించాలి. ఆ విధంగా చేస్తే ఒక క్రమంలో సిలబస్ ప్రిపరేషన్ సాగుతుంది. రివిజన్‌కు అవసరమైనంత సమయం దొరుకుతుంది.

డీఎస్సీ/టెట్ - 2024
ఇంగ్లిష్ మెథడాలజీ

TENTH Social Studies



To establish Supremacy

POWER SHARING

1 Mark

1) Which language was recognized as the only official language of Sri Lanka in 1956?

A. Sinhala

2) Apart from the Central and the State governments, which is the third type of government practised in Belgium?

A. Community government

3) Define majoritarianism.

A. Majoritarianism is rule by majority community by disregarding the needs and wishes of the minority community.

4) What measure was adopted by the democratically elected government of Sri Lanka to establish Sinhala Supremacy?

A. In 1956, an Act was passed to make Sinhala the official language. The government followed preferential policies favouring Sinhala applicants for University positions and government jobs.

5) What is the language spoken by the people residing in the Wallonia region of Belgium?

A. People residing in Wallonia region of Belgium speak French.

6) After independence, Sri Lanka witnessed the supremacy of which community?

A. Sri Lanka emerged as an independent country in 1948 and the democratically elected government adopted a series of measures to establish Sinhala supremacy.

Some More Important Questions

2 Marks

1) What is a Coalition Government?
2) What is meant by the system of 'checks and balances'?
3) What is the system of checks and balances in power sharing?
4) Why is power sharing desirable? Explain one reason.

For Answers

- KSV Krishna Reddy

SUBSCRIBE CHANNEL

అర్థవంతమైన గుణధర్మాల అమరిక!

జనరల్ స్టడీస్ - కెమిస్ట్రీ



మెడికల్ షాపులో వందల రకాల మందులు ఉన్నా, అడిగిన మెడిసిన్ వెంటనే దుకాణదారుడు తెచ్చి ఇచ్చేస్తాడు. సూపర్ బజార్‌లో ఏ వస్తువు కావాలంటే దాని దగ్గరకు నేరుగా వెళ్లిపోవచ్చు. కారణం ఆ మందులైనా, ఈ వస్తువులైనా ఒక క్రమంలో అమరి ఉంటాయి. అందుకే తేలిగ్గా అందుబాటులో ఉంటాయి. అదే విధంగా రసాయన శాస్త్రంలో అనేక రకాల మూలకాలు ఉన్నాయి. లక్షణాలను, గుణధర్మాలను అనుసరించి శాస్త్రవేత్తలు వాటిని వర్గీకరించారు. మూలకాలను అర్థం చేసుకోవడానికి, కొత్తవాటిని కనిపెట్టడానికి ఆ విభజన ఉపయోగపడుతుంది. ఈ నేపథ్యంలో పరీక్షల కోణంలో ముఖ్యమైన మూలకాల వర్గీకరణ గురించి అభ్యర్థులు తెలుసుకోవాలి. అందులోని వివిధ నియమాలనూ అర్థం చేసుకోవాలి.

మూలకాల వర్గీకరణ

భౌతిక రసాయన మార్పుల ద్వారా ఏదైనా పదార్థాన్ని అంత కంటే మరింత సూక్ష్మ పదార్థంగా విభజించలేకపోతే అదే మూలకం అని రాబర్ట్ బాయిల్ నిర్వచించాడు. 1661లో కేవలం 13 మూలకాలకు సంబంధించిన సమాచారం మాత్రమే అందుబాటులో ఉంది. 18వ శతాబ్దం చివరి నాటికి లెవోఇజర్ కాలంలో మరో 11; 1865 నాటికి దాదాపు 63 మూలకాలను కనుక్కున్నారు. 1940 నాటికి సహజ వనరుల నుంచి 91 మూలకాలు కనుక్కున్నారు. మరో 17 కృత్రిమంగా తయారుచేశారు. ప్రస్తుతం వాటి సంఖ్య 118.

డాబర్‌నీర్ త్రిక సిద్ధాంతం: ఈయన జర్మన్ రసాయన శాస్త్రవేత్త. ఒకే రకమైన రసాయన ధర్మాలున్న మూడేసి మూలకాల సమూహాలను గుర్తించి వాటిని త్రికం అని పేర్కొన్నాడు. 'ప్రతి త్రికంలో మధ్య మూలకం పరమాణు భారం మిగిలిన రెండు మూలకాల పరమాణు భారాల సరాసరికి దాదాపు సమానంగా ఉంటుంది.' అని డాబర్‌నీర్ ప్రతిపాదించాడు. దీన్నే 'డాబర్‌నీర్ త్రిక సిద్ధాంతం' అంటారు.

ఉదా: Li, Na, K; Ca, Sr, Ba; Cl, Br, I డాబర్‌నీర్ త్రికాలు

పరిమితులు: * డాబర్‌నీర్ కాలం నాటికి తెలిసిన మూలకాలన్నింటిని త్రికాలుగా అమర్చలేకపోయాడు. * ఈ సిద్ధాంతం అత్యధిక లేదా అత్యల్ప ద్రవ్యరాశులున్న మూలకాలకు వర్తించలేదు. * పరమాణు ద్రవ్యరాశిని కచ్చితంగా కొలిచే పరికరాలు అభివృద్ధి చెందిన తర్వాత ఈ సిద్ధాంతం కచ్చితమైందిగా నిలవలేకపోయింది.

న్యూలాండ్స్ అష్టక నియమం : జాన్ న్యూలాండ్స్ అనే బ్రిటిష్ శాస్త్రవేత్త 1865లో మూలకాలను, వాటి పరమాణు భారాల ఆరోహణ క్రమంలో అమర్చినప్పుడు అవి 7 గ్రూపులుగా ఏర్పడతాయని కనుక్కున్నాడు. ఆ విధంగా ఏర్పడిన గ్రూపుల్లో ఉండే మూలకాలు ఒకేవిధమైన రసాయన ధర్మాలతో ఉంటాయని గమనించాడు. దీని ఆధారంగా ఆయన అష్టక నియమాన్ని ప్రతిపాదించాడు.



లెవోఇజర్


అష్టక నియమం: మూలకాలను వాటి పరమాణు భారాల ఆరోహణ క్రమంలో అమర్చినప్పుడు వాటి ధర్మాలు నిర్ణీత వ్యవధుల్లో పునరావృతమవుతాయి. ఒక మూలకం నుంచి మొదలుపెడితే ప్రతి ఎనిమిదో మూలకం ధర్మాలు మొదటి మూలక ధర్మాలను పోలి ఉంటాయి. దీన్నే 'న్యూలాండ్స్ అష్టక నియమం' అంటారు. **ఉదా:** F, Na, Mg, Al, Si, P, S, Cl

* న్యూలాండ్స్ మూలకాల పట్టికలో హైడ్రోజన్‌తో మొదలుపెడితే ఎనిమిదో మూలకమైన ఫ్లోరిన్, ఆ తర్వాత ఎనిమిదో మూలకమైన క్లోరిన్‌లు ఒకేరకమైన ధర్మాలను ప్రదర్శిస్తాయి.

పరిమితులు: * న్యూలాండ్స్ ఒకేగడిలో రెండు మూలకాలను పొందుపరిచాడు. **ఉదా:** కోబాల్ట్, నికెల్ * పూర్తిగా భిన్నమైన ధర్మాలున్న కొన్ని మూలకాలను ఒకే గ్రూపులో అమర్చాడు. **ఉదా:** కోబాల్ట్, నికెల్, పెల్లాడియం, ప్లాటినం లాంటి వాటి ధర్మాలకు భిన్నంగా ఉన్న హాలోజన్ మూలకాలైన ఫ్లోరిన్ క్లోరిన్, బ్రోమిన్, అయోడిన్‌లను అమర్చాడు. * ఇతడి అష్టక నియమం క్యాల్షియం వరకు సరిగ్గానే వర్తించింది. * క్యాల్షియం కంటే ఎక్కువ పరమాణు ద్రవ్యరాశి ఉన్న మూలకాలకు ఇది వర్తించలేదు. * న్యూలాండ్స్ మూలకాల రసాయన ధర్మాల్లో ఆవర్తన క్రమాన్ని సంగీత స్వరాల్లోని ఆవర్తనంతో పోల్చాడు. ఉదాహరణకు భారతీయ సంగీతంలో ఒక స్కేలులో ఏడు సంగీత స్వరాలుంటాయి. ఎనిమిదో స్థానం తిరిగి మొదటి స్వరం (స) పునరావృతమవుతుంది. అవి స, రి, గ, మ, ప, ద, ని, స. * న్యూలాండ్స్ పట్టిక 56 మూలకాలకు మాత్రమే పరిమితమైంది. కొత్తగా కనిపెట్టబోయే మూలకాలకు ఎలాంటి ఖాళీలను విడిచిపెట్టలేదు.




డాబర్‌నీర్



న్యూలాండ్స్

మెండలీఫ్ ఆవర్తన పట్టిక: మెండలీఫ్ అనే రష్యన్ శాస్త్రవేత్త అప్పటి వరకు తెలిసిన మూలకాలను, వాటి పరమాణు భారాల ఆరోహణ క్రమంలో అమర్చి.. 8 నిలువు వరుసలు, 7 అడ్డ వరుసలుగా ఏర్పాటు చేశాడు. * నిలువు వరుసలను గ్రూపులుగా, అడ్డవరుసలను పీరియడ్లుగా పేర్కొన్నాడు. * గ్రూపులను ఎ, బి అనే ఉప గ్రూపులుగా విభజించాడు. * గ్రూపుల్లోని మూలకాలు ఒకే రసాయన ధర్మాలను ప్రదర్శిస్తాయి. * ఉప గ్రూపుల్లో మూలకాల రసాయన ధర్మాలు దాదాపు దగ్గర సంబంధాన్ని కలిగి ఉంటాయి.

* మెండలీఫ్ తన ఆవర్తన పట్టిక అమరికలో లభ్యంకాని మూలకాలకు ఖాళీ గదులను విడిచిపెట్టాడు. అలాగే భవిష్యత్తులో కనుక్కోబోయే మూలకాలకు తాత్కాలిక పేర్లను సూచించాడు. **ఉదా:** * ఎకా బోరాన్ - స్కాండియం * ఎకా అల్యూమినియం - గాలియం * ఎకా సిలికాన్ - జెర్మేనియం. * గాలియం అనే మూలకం అరచేతిలో పెట్టుకుంటే కరిగిపోతుందని ముందుగానే ఊహించి చెప్పాడు. * ఇప్పటి వరకు చెల్లాచెదురుగా ఉన్న వంటశాల లాంటి రసాయన శాస్త్రానికి మెండలీఫ్ పట్టిక ఒక చక్కని అమరిక ఇచ్చింది. * మెండలీఫ్ రసాయన శాస్త్రానికి చేసిన కృషికి 101వ మూలకానికి మెండలీవియం అని పేరుపెట్టారు.



మెండలీఫ్

పరిమితులు: * మెండలీఫ్ తన పట్టికలో అధిక పరమాణు భారం ఉన్న మూలకాన్ని (టెలూరియం Te-127) తక్కువ పరమాణుభారం ఉన్న మూలకం (అయోడిన్ I - 126) కంటే ముందు వరుసలో ఉంచాడు. * ఇతడు ఒకే గ్రూపుల్లో విభిన్న ధర్మాలున్న మూలకాలను ఏర్పాటు చేశాడు.

ఉదా: 1A గ్రూపు మూలకాలైన Li, Na, K లాంటి వాటిని 1B గ్రూప్ మూలకాలైన Cu, Au, Ag లాంటి వాటితో ఏర్పాటు చేశాడు.

* అదేవిధంగా 6A గ్రూపు మూలకాలైన క్లోరిన్ (అలోహం)ను 6B గ్రూపు మూలకానికి చెందిన Mn (లోహం)తో ఏర్పాటు చేశాడు.



రచయిత: చంటి రాజుపాలెం

అందరి ఆమోదంతో నూతన కౌలుచట్టం

- అభిప్రాయాలు తెలిపిన రైతులు, సంఘాల నాయకులు
- ప్రాంతీయ సదస్సులో మంత్రి అచ్చెన్నాయుడు



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి అచ్చెన్నాయుడు చిత్రంలో ఎమ్మెల్యేలు మాధవి, శ్రావణ్‌కుమార్, నరేంద్ర, కలెక్టర్ నాగలక్ష్మి తదితరులు

కలెక్టరేట్(గుంటూరు), న్యూస్‌టుడే: కౌలు రైతుల ప్రయోజనాలే ధ్యేయంగా అందరి ఆమోదంతో నూతన కౌలు చట్టాన్ని రూపొందిస్తున్నామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. నూతన కౌలు చట్టం రూపకల్పనపై తొలి ప్రాంతీయ సదస్సు సోమవారం గుంటూరు కలెక్టరేట్‌లో జరిగింది. సమావేశానికి వ్యవసాయ శాఖ డైరెక్టర్ ఢిల్లీరావు అధ్యక్షత వహించారు. అనంతరం మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ గత చట్టాలకు మిన్నగా కొత్త చట్టాన్ని అమలు చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. అందులో భాగంగానే భూ యజమానులు, కౌలురైతులు, రైతు సంఘాలందరితోనూ సమావేశమై అభిప్రాయాలను సేకరిస్తున్నామన్నారు. వ్యవసాయ శాఖ ప్రత్యేక కార్యదర్శి బి.రాజశేఖర్ మాట్లాడుతూ దేశంలో అన్ని రాష్ట్రాల కంటే ఏపీలోనే కౌలు రైతులు ఎక్కువగా ఉన్నారన్నారు. వారికి రుణాలు మంజూరు చేసేలా ప్రస్తుత చట్టంలో మార్పులు చేశామన్నారు. సాగు చేసిన పంటపై కౌలు రైతుకు హక్కు ఉంటుందే గాని భూమిపై ఉండదన్నారు. తద్వారా భూమి యజమానులకు ఇబ్బంది ఉండదన్నారు. ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ మాట్లాడుతూ నూతన చట్టంలో జిల్లా స్థాయి అధికారిని అప్పిలేట్ అధికారిగా నియమిస్తే బాగుంటుందన్నారు. తాడికొండ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ కౌలు రైతు గుర్తింపు కార్డుల జారీ ప్రక్రియను వ్యవసాయ శాఖకు కేటాయించడం వల్ల ఇబ్బందులున్నాయన్నారు. జడ్పీ ఛైర్‌పర్సన్ క్రిస్టినా, గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి, జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి ప్రసంగించారు.

- ప్రాంతీయ సదస్సులో భాగంగా గుంటూరు, పల్నాడు, బాపట్ల, ఎన్టీఆర్, ప్రకాశం జిల్లాల నుంచి వచ్చిన రైతు సంఘాలు, రైతులు, కౌలు రైతుల నుంచి అభిప్రాయాలను సేకరించారు. రైతు సంఘాల నాయకులు హరిబాబు, కృష్ణయ్య, ప్రభాకర్‌రెడ్డి, సురేష్, రంగారెడ్డి పాల్గొన్నారు.

రవాణా శాఖ ఆన్‌లైన్ సేవలు ప్రజలకు మరింత చేరువ

పట్టాభిపురం, న్యూస్‌టుడే: రవాణా శాఖలో ప్రభుత్వం చేపడుతున్న ఆన్‌లైన్ సేవల్ని ప్రజలకు మరింత చేరువ చేస్తామని గుంటూరు రవాణా శాఖ ఉప కమిషనర్ కె.సీతారామిరెడ్డి స్పష్టం చేశారు. డీటీసీగా ఆయన సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు డీటీసీగా విధులు నిర్వర్తించిన షేక్ కరీం ఏలూరుకు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో విజయవాడ కమిషనరేట్‌లో డీటీసీగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న సీతారామిరెడ్డిని ప్రభుత్వం నియమించింది. ఈయన 1994లో ఎంవీఐగా రవాణా శాఖలో చేరారు. బాపట్ల, చీరాల, కావలి, నెల్లూరులో ఎంవీఐగా పని చేశారు. నెల్లూరులో ఎంవీఐగా విధులు నిర్వర్తించే సమయంలో ఆర్టీఓగా పదోన్నతి లభించింది. తిరుపతి, విజయవాడల్లో ఆర్టీఓగా సేవలందించారు. 2019లో డీటీసీగా పదోన్నతి లభించింది. బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా సీతారామిరెడ్డి మాట్లాడుతూ రవాణా శాఖ వాహన్, సారథి ద్వారా అందిస్తున్న ఆన్‌లైన్ సేవలపై ప్రజలకు మరింత అవగాహన కల్పిస్తామన్నారు. దళారుల ప్రమేయాన్ని అరికట్టేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ప్రమాదాల నివారణకు, రహదారి భద్రతకు అధిక ప్రాధాన్యం ఇస్తామన్నారు. ఓవర్‌లోడింగ్, అధిక వేగం, లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపే వారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. వాహనచోదకులు ట్రాఫిక్ నిబంధనలు పాటించేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఇన్‌ఛార్జి ఆర్టీఓ గోపాల్, పలువురు ఎంవీఐలు.. సీతారామిరెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు.

ఉపాధికి ఊతంగా పొగనారుమళ్లు

- పలు గ్రామాల్లో పెంచుతున్న రైతులు
- ప్రస్తుతం ఆరు వేల మొక్క మూట ధర రూ.2 వేలు

చిలకలూరిపేట గ్రామీణ, న్యూస్‌టుడే



గోపాళంవారిపాలెం వద్ద పొగనారు మళ్లు

చిలకలూరిపేట ప్రాంతంలో గ్రామీణ రైతులకు పొగనారు మళ్ల పెంపకం ఉపాధికి ఊతంగా మారింది. ఆగస్టు నుంచి అక్టోబరు వరకు పరిసర ప్రాంత రైతులకు నారు అందించేందుకు ఈ ప్రాంత రైతులు వీటిని పెంచుతున్నారు. దశాబ్దాలుగా పొగ నారుమళ్లకు ప్రసిద్ధిగాంచిన మురికిపూడితో పాటు రామచంద్రాపురం, రాజాపేట, గోపాళంవారిపాలెంలో విస్తృతంగా వీటిని సాగు చేస్తున్నారు. ప్రధానంగా తెల్ల బర్లీ, నల్ల బర్లీ నారుమళ్ల సాగు ఎక్కువగా ఉంది. ఎకరాకు 200 మండల వరకు నారు పెంచుతారు. దీనికి వ్యవసాయం, విత్తనాలు, సాగునీరు, కలుపు, బలం మందులు, పురుగు మందులు కలిపితే ఎకరాకు రూ.2లక్షల వరకు పెట్టుబడి అవుతుంది. నాలుగు మడుల్లో ఒకసారి నారు తొలగిస్తే 6 వేల మొక్కలు వస్తాయి. ప్రస్తుతం వీటిని ఉంచే మూట ఖరీదు రూ.2 వేలుగా ఉంది. ఇలా ఎకరాకు ఒకసారి తొలగిస్తే 80 మూటల నారు వస్తుంది. 5 సార్లు తొలగిస్తే 400 మూటల నారు వస్తుంది. మూట రూ.2 వేలు పలికినా రూ.8 లక్షలు వస్తాయి. ఖర్చులన్నీ పోనూ రూ.6 లక్షల వరకు ఆదాయం వస్తుంది. గతేడాది డిమాండ్ బాగా పెరగడంతో మూట నారు రూ.12 వేలు పలికింది. దీంతో ఈ ప్రాంతంలో రైతుల పంట పండింది. ప్రధానంగా చిలకలూరిపేట, నాదెండ్ల, యడ్లపాడు, బల్లికురవ, యద్దనపూడి, సంతమాగులూరు, మార్టూరు తదితర ప్రాంతాల నుంచి ఎక్కువగా నారు కొంటారు.

రైతేరాజు

గిరాకీని బట్టి ఉంటుంది



పొగ నారుకు డిమాండ్‌ను బట్టి ఆదాయం ఉంటుంది. ఒక్కొక్కసారి నారు పలుచగా వస్తే తక్కువ దిగుడి వస్తుంది. అలాంటప్పుడు ఆదాయం తగ్గుతుంది. వర్షాలు ఎక్కువగా పడినా నారు దెబ్బతింటుంది. అన్నీ బాగుండి ధర కలిసివస్తే మంచి ఆదాయం వస్తుంది. ఈ ఏడాది ఎకరాలో సాగు చేపట్టాను. ప్రస్తుతం ధర మూట రూ.2 వేలు ఉంది. **- గోరంట్ల సాంబశివరావు, గోపాళంవారిపాలెం**

వర్షాకాలం.. పశు ఆరోగ్యం జాగ్రత్త

గురజాల గ్రామీణ, న్యూస్‌టుడే



గ్రామీణ ప్రాంతంలో రైతులు పోషణలో పశు సంపద కీలకపాత్ర పోషిస్తోంది. వర్షాకాలంలో పశువుల సంరక్షణకు ప్రత్యేక శ్రద్ధ చూపించాలని గురజాల మండల పశు సంవర్ధకశాఖ అధికారి నాగమల్లేశ్వరరావు సూచించారు. ఆవులు, గేదెలు ఈ కాలంలో గొంతువాపుతో బాధ పడుతుంటాయి. దీన్ని గురక వ్యాధి అంటారు. దీని బారిన పడిన పశువును మంద నుంచి తప్పించాలి. తీవ్రతను బట్టి సల్ఫాడిమిడిన్, ఇంటాసెఫ్‌టాజు వంటి ఇంజక్షన్లు ఇస్తే మంచిది. తెల్ల ఆవులు, ఎద్దులకు జబ్బువాపు సోకకుండా బీక్యూ వ్యాక్సిన్లు, గొర్రెలు, మేకలకు చిటిక వ్యాధి రాకుండా ఈటీ వ్యాక్సిన్లు ఇవ్వాలి. గొర్రె పిల్లల పట్ల అప్రమత్తంగా ఉండాలి. పిల్లలు పుట్టగానే ధనుర్వాతం రాకుండా టెటనస్ టాక్సాయిడ్ ఇంజక్షన్ చేయించాలి. 3, 4, 5 రోజుల్లో యాంటీ బయోటిక్ పొడరును నీళ్లలో కలిపి తాగించడం, ఏడు రోజుల్లో లివర్ టానిక్స్ తాగించాలి. పారుడు, మసూచి రాకుండా టీకాలు ఇవ్వాలి.

పాముపొడ పని పడదాం

చెరుకుపల్లి, న్యూస్‌టుడే : వరిలో పాముపొడ తెగులు సకాలంలో గుర్తించి నివారణ చర్యలు చేపట్టాలని మండల వ్యవసాయాధికారి టి.బాలాజీ గంగాధర్ సూచించారు. పైరు దుబ్బు చేసే సమయంలో ఈ తెగులు వ్యాపిస్తుందన్నారు. వాతావరణ మార్పుల కారణంగా తెగులు తీవ్రత ఎక్కువ అవటానికి ఆస్కారం ఉందన్నారు. మబ్బులతో కూడిన వర్షం, చెట్లనీడ, పైరు నేలపై పడిపోయినపుడు తెగులు త్వరగా అభివృద్ధి చెందుతుందని చెప్పారు. తెగులు తొలుత గట్ల నుంచి ప్రారంభమవుతుందని, కనుక ముందుగా గట్లపై కలుపు మొక్కలు తొలగించి శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. తెగులు నివారణకు లీటరు నీటికి హెక్సాకొనజోల్ 2 మి.లీ. లేదా వాలిడామైసిన్ 2 మి.లీ. లేదా ప్రోపికొనజోల్ 1 మి.లీ. వీటిలో ఏదైనా ఒకదానిని కలిపి పిచికారి చేస్తే తెగులు నివారించుకోవచ్చని, తెగులు లక్షణాలు కనిపించినపుడు నత్రజని వాడకం తగ్గించాలని ఆయన సూచించారు.

కందిలో వెర్రి తెగులు.. నివారణ చర్యలు



వెర్రి తెగులు సోకిన కంది పైరు

వినుకొండ, న్యూస్‌టుడే : కంది పైరును కొన్నేళ్లుగా వెర్రి తెగులు సోకి నష్టపరుస్తోంది. ఇరియోఫిడ్ మైట్ అని పిలిచే నల్లి దీన్ని వ్యాప్తి చేస్తుంది. తెగులు లక్షణాలు, నివారణ చర్యలను ఆచార్య ఎన్జీరంగ విశ్వవిద్యాలయం విశ్రాంత వ్యవసాయ శాస్త్రవేత్త ఈదర వెంకటేశ్వర్లు వివరించారు.

కనిపించే లక్షణాలు

ఆకులు లేత ఆకుపచ్చ రంగులో అక్కడక్కడ పసుపు రంగు మచ్చలతో చిన్న పరిమాణంలో సాధారణం కంటే ఎక్కువ సంఖ్యలో ఉంటాయి. కొమ్మలు విస్తరించడం తక్కువగా ఉంటుంది. కొన్ని పూత లేకుండా ఉంటాయి. పూత కాయగా మారడం చాలా తక్కువగా ఉంటుంది. కాయలో గింజలు చిన్న పరిమాణంలో ఉంటాయి. తెగులు ఉద్ధృతి ఉంటే పంట నష్టం అధికంగా ఉంటుంది.

నివారణ చర్యలు

ఐసీసీయల్- 87119, 85063, యల్ఆర్‌జీ- 105 కంది రకాలు ఈ తెగులు కొంత తట్టుకునే శక్తి ఉంటుంది. గత సంవత్సరం వెర్రి తెగులు ఆశించిన చోట మందులు పిచికారి చేసి నివారించవచ్చు. పైరు విత్తిన 35-40 రోజుల్లో నీటిలో కరిగే గంధకం 80 శాతం (థయోవిట్, ట్రైఫాల్, సల్ఫాఫ్) ఎకరాకు 600 గ్రాముల చొప్పున పిచికారి చేయాలి. రెండోసారి 60- 70 రోజుల సమయంలో ప్రాపార్గైట్ 57 శాతం (ఓమైట్) ఎకరాకు 400 మి.లీ. పిచికారి చేయాలి.